# నేటి నిజం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 20-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:132 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

దేశంలో సమస్యలు
దుఃఖాలు కోకొల్లలు
పరిష్కార మార్గానికి
ప్రయత్నిస్తే లేవెళ్లలు.

కళ్లముందే కనిపించినా
కారణాల జననం
చలించక మిన్నకుంటే
జనం భవితే హననం



-వేల్పుల నారాయణ 9440433475

website2:www.netinijam.com

## పాలస్తీనా యూనివర్సిటీ క్యాంపస్ బిల్డింగ్‌ను పేల్చివేసిన ఇజ్రాయిల్ దళాలు

న్యూయార్క్ జనవరి 19 : గాజాలోని పాలస్తీనా యూనివర్సిటీ కి చెందిన ఓ క్యాంపస్ బిల్డింగ్‌ను ఇజ్రాయిల్ దళాలు పేల్చివేశాయి. ఆ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. ఆ వీడియోపై అమెరికా అనుమానాలు వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో షేర్ అవుతున్న ఆ పేలుడు వీడియోపై అమెరికా క్లారిటీ కోరింది. నిర్మానుషంగా ఉన్న యూనివర్సిటీ బిల్డింగ్ అకస్మాత్తుగా పేలుతుంది. ఆ బిల్డింగ్‌లో దాచిపెట్టిన పేలుడు పదార్ధాల వల్ల అది పేలినట్లు తెలుస్తోంది. పేలిన తర్వాత అన్ని దిక్కులా శిథిలాలు ఎగిరిపడ్డాయి. భారీ స్థాయిలో పొగ కూడా వచ్చింది. అయితే ఈ వీడియోపై కామెంట్ చేసేందుకు అమెరికా రక్షణ శాఖ ప్రతినిధి డేవిడ్ మిల్లర్ నిరాకరించారు. తమ వద్ద సరైన సమాచారం లేదన్నారు. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయిల్‌పై హమాస్ అటాక్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇజ్రాయిల్, హమాస్ మధ్య వార్ నడుస్తోంది.

## ప్రేమించాలంటూ బాలికపై కత్తితో దాడి.. ఆపై రైలుకింద పడి ఆత్మహత్య



హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రేమించాలంటూ కొన్నాళ్లుగా పదో తరగతి బాలిక వెంటపడిన నిందితుడు అందుకు ఒప్పుకోకపోవడంతో కత్తితో దాడి చేశాడు. ఆపై తాను రైలు) కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. రమణ అనే నిందితుడు ఓ బాలికను ప్రేమించాలని వెంటపడి వేధించాడు. అందుకు బాలిక ఒప్పుకోలేదు. దీంతో ప్రేమను నిరాకరిస్తుందనే కోపంతో గురువారం ట్యూషన్‌లో ఉన్న బాలికపై కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన ట్యూషన్ టీచర్‌పైనా దాడి చేసి రమణ పరారయ్యాడు. దాడిలో గాయపడిన బాలిక, ట్యూషన్ టీచర్‌ను దవాఖానకు తరలించారు. కాగా, రమణ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం విద్యానగర్ సమీపంలో రైలుపట్టాలపై రమణ మృతదేహం లభ్యమైంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం

**- రోడ్లు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి-**




హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గత ప్రభుత్వం పేపర్లలో ఫోటోలు ? టీవిల్లో స్టేట్మెంట్లు తప్పితే ఎక్కడా నిజాల్ని వెల్లడించలేదన్నారు మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఇవ్వాల న్యాక్ లో జరిగిన ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారిగారితో కలిసి పాల్గొన్న మంత్రి.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడా చట్టబద్ధమైన పాలన సాగలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం తెలంగాణ నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసి లక్షల మంది యువత జీవితాలతో ఆడుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు పెట్టుబడుల పేరిట మీడియా ప్రచారం తప్పా.. ఒక్కటి కార్యరూపం దాల్చలేదన్నారు. దుబాయ్ కు చెందిన నాఫ్కో కంపెనీ న్యాక్ తో ఒప్పందం చేసుకొని ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమిని ఏర్పాటు చేస్తుందని చెప్పి ప్రచారం చేసుకున్నారని తీరా ఇవ్వాల చూస్తే అసలు ఆ కంపెనీ ఊసేలేదని న్యాక్ సిబ్బంది చెప్పడం ఆశ్చర్యం కలిగించిం దన్నారు. ప్రతీ సంవత్సరం కనీసం నాలుగుసార్లు జరపాల్సిన న్యాక్ గవర్నింగ్ బాడీ సమావేశాల్ని 10 సంవత్సరాల్లో కేవలం ఒక్కసారి మాత్రమే జరపడం అత్యంత బాధాకరం అన్నారు. రాబోయే రోజుల్లో 9 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో, మండలాల వారిగా నిరుద్యోగులకి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేసి.. ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఆయన తెలిపారు. న్యాక్ కు సంబంధించిన భూముల్ని పొందిన కొన్ని సంస్థలు పూర్తిగా కమర్షియల్ కార్యకలపాలకు వినియోగిస్తూ న్యాక్ ఆదాయానికి పెద్దయెత్తున్న గండికొడుతున్నాయని వాటిని సరిచేస్తామని ఆయన తెలిపారు. సుదీర్ఘ జరిగిన సమావేశంలో కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం, జిల్లాల్లో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు చేయడం, న్యాక్ భూముల్ని కాపాడటం, నిరుద్యోగులకు ఉపాధికల్పనకు నిర్వహించాల్సిన కోర్సుల గురించి విస్తృతంగా చర్చించారు. ఇదే సమావేశంలో ఆర్ ఽ బి ఎంప్లాయిస్ అసోసియేషన్, న్యాక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ క్యాలెండర్లను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు.

## డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



హైదరాబాద్, జనవరి 19:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇవాళ కలుసుకున్నారు. భట్టి నివాసం ప్రజాభవన్ లో ఇవాళ మధ్యాహ్నం ఉపముఖ్యమంత్రిని కలుసుకుని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వడంలో సహకరించాలని కోరారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు.

## బోయింగ్ గ్లోబల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 19:బోయింగ్ నూతన గ్లోబల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూర్‌లో శుక్రవారం ప్రారంభించారు. కర్నాటక సీఎం సిద్ధరామయ్య కూడా హాజరైన ఈ కార్యక్రమంలో జనం మోదీ నినాదాలతో హోరెత్తించడంతో ప్రధాని రియాక్టయ్యారు. ముఖ్యమంత్రి జీ ఇలా జరుగుతుంటుందని వ్యాఖ్యానించారు.

దేశంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా భారత విమానయాన సంస్థలు వందలాది విమానాలకు ఆర్డర్లు ఇస్తున్నాయని, భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద దేశీ ఏవియేషన్ మార్కెట్‌గా ఎదిగిందని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఏవియేషన్ మార్కెట్‌కు భారత్ సరికొత్త ఊపునిస్తోందని అన్నారు. మన దేశంలోని పైలట్లలో 15 శాతం మంది మహిళలేనని, ఇది ప్రపంచ సగటు కంటే మూడు రెట్లు అధికమని చెప్పారు.

మహిళ కేంద్రంగా అభివృద్ధి చోటుచేసుకునే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. కాగా, బోయింగ్ ఇండియా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను 43 ఎకరాల విస్తీర్ణంలో రూ 1600 కోట్ల వ్యయంతో నిర్మించారు. అమెరికా వెలుపల విమాన తయారీ దిగ్గజం పెట్టిన ఈతరహా భారీ పెట్టుబడి ఇదేనని బోయింగ్ పేర్కొంది.

# ధార్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత : మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జనవరి 19:ధార్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకం అన్నారు. శుక్రవారం మహబూబనగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొల్లూరులో ఏర్పాటు చేసిన శ్రీచింతలపురి చిన్మయ స్వామి మఠం రజతోత్సవ వేడుకల ప్రారంభోత్సోవానికి మంత్రి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుడిని కొలిస్తేనే ఆయన శక్తియుక్తులు కలిగిస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గం అనుసరిస్తే ముక్తి ప్రాప్తిస్తుందని తెలిపారు. కొల్లూరులో చిన్మయస్వామి మఠాధిపతి శ్రీనందీశ్వర స్వామి పెద్ద ఎత్తున రజతోత్సవాలు నిర్వహించడం హర్షణీయమన్నారు.

శ్రీశైలం పుణ్యక్షేత్ర పీఠాధిపతి 1008వ జగద్గురు శివాచార్య మహాస్వాములు మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ భక్తిభావంతో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, రాజేశ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్ నాయకులకు ఇంకా జ్ఞానోదయం కావడం లేదు

**- రెండు హామీలను అమలు చేస్తేనే బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారు**

**-ఎవరి పార్టీ గల్లంతు అవుతుందో మరో మూడు నెలలు ఆగితే తేలుతుంది**

**-బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా సొంత పార్టీ నేతలే అవిశ్వాస తీర్మానాలు**

**-పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ లో కేసిఆర్ కుటుంబం తప్ప ఒక్కరు కూడా మిగలరన్నారు**

**-పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తాం**

**- ప్రతీ పైసాకు వారు లెక్క చెప్పాల్సిందే: మంత్రి జూపల్లి కృష్ణారావు..**

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలను మోసం చేశారు కాబట్టే గత అసెంబ్లీ ఎన్నికల్లో మీకు కర్రు కాల్చి వాత పెట్టారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల అహంకార దోరణి, కుటుంబ పాలన వల్ల ప్రజలు విసిగి, వేసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. మీరు పదేండ్లు అధికారంలో ఉండి దళితులకు మూడు ఎకరాల భూమి, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇలా మీరిచ్చిన హామీలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి తీరుతుంది. ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరతా మన్నారు. కాంగ్రెస్ పార్టీ ట్రాక్ రికార్డ్ ఎందో ప్రజలకు తెలుసు. మిగితా రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను కూడా అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుం దన్నారు. ప్రజా పాలనకు అనూహ్య స్పందన వచ్చింది. దరఖాస్తుల డిజిటలైజ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్ రెడ్డి రెండు హామీలను నెరవేర్చారు. మహిళలకు ఫ్రీ బస్ సేవలు అమలు చేయడంతో వారి నుంచి అనూహ్య స్పందన వస్తుంది. రెండు హామీలను అమలు చేస్తేనే బీఆర్ఎస్ నాయకులు భయపడుతు న్నారు. ఇంకా మిగతా హామీలు అమలు చేస్తే ఆ పార్టీ తెలంగాణలో పూర్తిగా తూడ్చిపెట్టు కుపోతుందని ఆందోళనలతో కాంగ్రెస్ పార్టీ గల్లంతు అవుతుందని, ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరగబడు తారు అని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు ఏదేదో మాట్లాడుతున్నారు. ఎవరి పార్టీ గల్లంతు అవుతుందో మరో మూడు నెలలు ఆగితే తేలుతుందన్నారు. ఇప్పటికే ఆ పార్టీ ఖాళీ అవుతుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ కనుమరుగు అవడం ఖాయం. అందుకే మేము నిర్మాణా త్మక పాత్ర పోషిస్తాం, కాంగ్రెస్ పార్టీకి సహకారం అందిస్తాం అని బీఆర్ఎస్ నాయకులే చెప్పారు. మరి పట్టుమని రెండు నెలల కూడా కాకముందే ఎందు కు అంత ఉలికి పడుతున్నార న్నారు. పథకాలు అమలైతే బీఆర్ఎస్ పార్టీ మూత పడుతది కాబట్టే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావద్దని బీఆర్ఎస్ నేతలు గట్టిగా కోరుకుం టున్నారన్నారు. కానీ వారివి పగటి కలలు మాత్రమే. ఆరు గ్యారంటీలు అమలు కావడం గ్యారంటీ బీఆర్ఎస్ తెలంగాణలో కనుమరుగు కావడం గ్యారంటీవచ్చే లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావు అందుకే పార్టీని బతికించుకోవడానికి బీజేపీతో పొత్తు పెట్టుకో వడానికి తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై మంతనాలు కొనసాగుతున్నాయని అన్నరు. గత పదేండ్లలో బీజేపీతో అంటకాగారు. ఇప్పుడు కూడా బీజేపీతో పొత్తుకు సిద్ధమవుతున్నారు. ఎవరు ఎన్ని చేసినా పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకోబోతుందని జోస్యం చెప్పారు. సమీక్షల పేరుతో సమావేశాలు పెట్టి .. రాజకీయ విమర్శలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు భయపడుతున్నారు. ఎవరు ముందుకు రావడం లేదు మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా సొంత పార్టీ నేతలే అవిశ్వాస తీర్మానాలు పెడుతున్నారు. ఆ పార్టీని వీడుతున్నారని, బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీలో కేసిఆర్ కుటుంబం తప్ప ఒక్కరు కూడా మిగలంన్నారు..అందుకే ఆ ఫ్రస్టేషన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ పై విమర్శలు చేస్తూ ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ క్యాడర్ ను కాపాడుకునేందుకే ఆరు గ్యారంటీలు కాంగ్రెస్ అమలు చేయదు అని మైండ్ గేమ్ ఆడుతున్నారు. మీరు ఎంత చేసిన బీఆర్ఎస్ తెలంగాణలో ఖాళీ అవడం ఖాయం మీరు ఎంత అసత్య ప్రచారం చేసిన ప్రజలు మిమ్మల్ని నమ్మరుఇది ఇట్లా ఉంటే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కాళేశ్వరం తో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులు పేరుతో కమిషన్ల కోసం ప్రజా ధనాన్ని దోచుకున్నారు. నిధులను దుర్వినియోగం చేశారు.

## నేడు, రేపు 8వ తెలంగాణ రాష్ట్ర దంత వైద్యుల వార్షిక సదస్సు




ఖమ్మం, జనవరి 19:(నేటినిజం ప్రతినిధి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడిఏ) ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో 8వ తెలంగాణ రాష్ట్ర దంత వైద్యుల వార్షిక సదస్సును ఖమ్మంలోని ఎస్ఆర్ డిజి స్కూల్ లో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ కుతుంబాక శ్రీరామ్, సెక్రటరీ డాక్టర్ నాగుబండి కిరణ్ కుమార్ తెలిపారు. ఖమ్మంలోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ...ఖమ్మంలో తొలిసారిగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సు ప్రారంభం కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని సుమారు 2వేల మంది దంత వైద్యులు హాజరు కానున్నారని తెలిపారు. దంత వైద్య రంగంలో నూతన, అత్యాధునిక శిక్షణ విధానాలను. ఆయా రంగాల్లోని ప్రముఖ నిష్ణాతులైన వైద్యులు వివరించనున్నట్లు తెలిపారు. దీనితో పాటు నూతన పరికరాలను ప్రదర్శించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు దంత వైద్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యులు సిహెచ్ విఆర్ నాగేశ్వరరావు, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కిషోర్ గౌడ్, సునీల్ పాల్గొన్నారు.

**నేటి కందం- నేటికి అందం**

మరతమే .. న్యూక్లియర్ రియా
క్టరుతో విద్యుత్తును మనకై నెలగా-న
ప్పర నిటకు దెచ్చి జాతికి
వరణీయముగా నొసగిన పర్వదినంబున్

( 20-1-1957 న్యూక్లియర్ రియాక్టర్ అప్సరను జాతికి అంకితం చేసిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

## పంచాయతీ బిల్లులు పక్కదారి పట్టించారు - సీతక్క



ములుగు , జనవరి 19: (నేటినిజం ప్రతినిధి): సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మంత్రి సీతక్క అన్నారు. దీంతో ఐదేళ్లుగా వారికి చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. దీంతో సర్పంచ్ లు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ములుగు పంచాయతీ పాలకవర్గం సభ్యులు శుక్రవారం మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్ లకు చెల్లించాల్సిన రూ.1,200 కోట్లను దారి మళ్లించిందని విమర్శించారు. దీంతో చాలా మంది సర్పంచ్ లు అప్పులు తీసుకొచ్చి ఖర్చు పెట్టారని తెలిపారు.

ఈ విషయాన్ని గతంలో అసెంబ్లీలో ప్రస్తావిస్తే.. అన్ని చెల్లింపులు జరిపామని అప్పటి ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని అన్నారు. కానీ ఇప్పుడు రికార్డులన్నీ పరిశీలిస్తే చాలా బిల్లులు పెండింగ్ లోనే ఉన్నాయని తెలుస్తోందని అన్నారు. వాటిని ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందా అని సర్పంచ్ లు ఇంకా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇంకా నెల రోజులు గడిస్తే వారి పదవీ కాలం కూడా ముగుస్తుందని తెలిపారు. అందుకే వారి సమస్యను కేబినేట్ మీటింగ్ లో చర్చిస్తామని, ఓ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. .

## ఉత్తరప్రదేశ్‌లో భారీ ప్రమాదం.. గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీకి మంటలు



లక్నో జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో భారీ ప్రమాదం జరిగింది. గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీకి మంటలు అంటుకున్నాయి. దీంతో సిలిండర్లు పేలిపోయాయి. ఎల్పీజీ సిలిండర్ల లోడ్‌తో ఉన్న ఓ లారీ లక్నో నుంచి గోండాకు వెళ్తున్నది. ఈ క్రమంలో గోండా సరిహద్దులోకి చేరుకోగానే లారీలో మంటలు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఒకదాని తర్వాత ఒక సిలిండర్ పేలిపోయింది. గ్యాస్ బండలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. పేలుడు ధాటికి లారీ పూర్తిగా ధ్వంసమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపుచేశారు. ముందుజాగ్రత్త చర్యగా ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి కిలోమీటరు వరకు ఇరువైపులో వాహనాలను నిలిపివేశారు. కాగా, ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాపు చేస్తున్నామన్నారు.

## 22న సెలవు ప్రకటించిన మహారాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 19:అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిర ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం జనవరి 22న పబ్లిక్ హాలిడేను ప్రకటించింది. రాష్ట్ర మంత్రి, బీజేపీ నేత మంగళ్ ప్రభాత్ లోధా విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి కార్యక్రమాలకు సెలవు ఇచ్చే ఆనవాయితీ లేదని అంతకుముందు ఈ వినతిని రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ తోసిపుచ్చింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కార్యాలయానికి విజ్ఞప్తిని పంపడంతో అత్యున్నత స్థాయిలో పబ్లిక్ హాలిడేపై నిర్ణయం తీసుకున్నారు. రామమందిర ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 22న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, పారిశ్రామిక సంస్థలకు హాఫ్ డే సెలవు ప్రకటించిన నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే యూపీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, గోవా ప్రభుత్వాలు 22న ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాయి. ఇక అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఈనెల 22న మాంసం, మద్యం విక్రయాలు నిలిపివేస్తూ పలు బీజేపీ పాలిత రాష్ట్రాలు నిషేధం విధించాయి. ఇక త్రిపురలో జనవరి 22 మధ్యాహ్నం 2.30 గంటల వరకూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# వీడియో గేమింగ్ విషవలయంలో నేటి పిల్లలు, యువత విలవిల?!

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ నానో యుగం వరకు మానవాళి పరిణామ క్రమంలో ఊహకందని మార్పులను చవిచూశాం. అంతర్జాల వలలో నవ్య నరులు తేలిపోతున్నారు. అరచేతిలో వైకుంఠం వలె స్మార్ట్‌ఫోన్ రూపాంతరం చెందింది. ఒక్క క్లిక్‌తో సమాచార సునామీ వెల్లువెత్తుతోంది. దూరాలు సమసిపోయాయి, సరిహద్దుల నిర్వచనాలు మారిపోయాయి. నేటి ఆధునిక మనిషి జీవనశైలిలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. చంటి పిల్లల నుంచి పండు ముసలి వరకు చరవాణి మోజులో ఊగిపోతున్నారు. సమాచార మాధ్యమాల వెల్లువతో క్షణాల్లో ప్రపంచ ఘటనలు మానవాళి చెంతకి అప్రయత్నంగానే చేరుతున్నాయి.

స్మార్ట్‌ఫోన్, టాబ్, లాప్‌టాప్ వెలుగుల తెరలపై మనుషులు అతుక్కుపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ చిత్రాలు చూపందే చంటోళ్లకు ముద్ద దిగడం లేదు. మైదానాల్లో ఆడాల్సిన పిల్లలు, యువత డ్రాయింగ్ రూమ్ లేదా బెడ్ రూమ్‌ల నుంచి వీడియో గేమ్స్ ఆడుతూ ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. వీడియో గేమింగ్ సైట్లు/యాప్‌లు పుట్టగొడుగుల్లా వెలువడం కూడా గేమింగ్ రుగ్మతలకు కారణం అవుతున్నాయి. ఒక్క అమెరికాలోనే దాదాపు 10 శాతం వరకు జనాభా ఈ రుగ్మతలతో బాధపడుతున్నట్లు తేల్చారు.

### అపరిమిత అంతర్జాల అందుబాటు:

రోజుకు ఏడెనిమిది గంటలు వీడియో గేమ్స్ మాయలో పడిపోయి భవిష్యత్తులను, ఆరోగ్యాలను కోల్పోతున్నారు. మితిమీరిన వీడియో గేమ్స్ ఆడుతున్న యువత దుష్ప్రభాలకు లోనవుతూ వీడియో గేమింగ్ రుగ్మతల (గేమింగ్ డిసార్డర్, డిజిటల్ డిజార్డర్) విష వలలో చిక్కి తీవ్ర మానసిక, శారీరక సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. హైస్పీడ్ బ్రాడ్‌బాండ్, స్మార్ట్‌ఫోన్ ఉచిత డాటా అందరికీ అందుబాటులోకి రావడంతో బాలలు, యువతీయువకులు నిత్యం వీడియో గేమ్స్ చూస్తూ వ్యసనపరులు అవుతున్నారు. ఆన్‌లైన్ తరగతులు కొనసాగడంతో బాలలు, విద్యార్థినీవిద్యార్థుల చేతికి స్మార్ట్‌ఫోన్ లేదా లాబ్‌టాప్‌లను అందిస్తున్నారు తల్లితండ్రులు. పిల్లలు ఏ సమాచారాన్ని, ఆటను, ఆడియోల మోజులో మునిగి పోతున్నారో తెలియడం లేదు. 12 ఏండ్ల లోపు బాలలు కూడా వీడియో గేమింగ్ రుగ్మతల బారిన పడడం విచారకరమని కుటుంబ పెద్దలు తెలుసుకోవాలి.

### వీడియో గేమింగ్ రుగ్మత నిర్వచనం:

ఇలా వీడియో గేమ్స్, ఇంటర్నెట్ గేమ్స్ ఆడుతున్న యువత స్వయం నియంత్రణ కోల్పోయి దుర్వ్యసనాలపాలు కావడాన్ని 'వీడియో గేమింగ్ రుగ్మత లేదా గేమింగ్ అడిక్షన్ లేదా ఇంటర్నెట్ గేమింగ్ డిజార్డర్' అని అంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, డబ్ల్యూహెచ్‌ఓలోని మరో విభాగమైన 'ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్(ఐసిడి)-11' నిర్వచనం ప్రకారం వీడియో గేమింగ్ దురలవాటుకు లోనైన బాలలు, యువతీయువకులు తమ చదువులను, ఉద్యోగాలను మరిచి అనేక గంటలు నీలి తెరల్లో దృష్టి కేంద్రీకరించి, దినచర్యను పక్కనబెట్టి అంతర్జాల ఆటల్లో సమయాన్ని వృధా చేయడమే కాకుండా పలు శారీరక మానసిక రుగ్మతలకు గురి కావడం సర్వసాధారణం అవుతున్నది. వీడియో గేమింగ్ రుగ్మతలతో వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, విద్య, ఉద్యోగ ఉపాధులను సహితం నిర్లక్ష్యం చేయడాన్ని గేమింగ్ రుగ్మతలుగా గుర్తిస్తున్నారు. డిజిటల్ గేమింగ్ రుగ్మతను నిర్ధారించడానికి వ్యక్తి ప్రవర్తనను నిశితంగా, అలవాట్లలో వచ్చిన మార్పులను పరిశీలించాల్సి ఉంటుంది.

### వీడియో గేమింద్ దుష్ప్రభావాలు:

వీడియో గేమింగ్ క్రీడల్లో రోజుకు 7, 8 గంటలు వరకు గడపడం ప్రమాదకరమని, ఆసక్తి ఉన్న వారు రోజుకు అరగంట వరకు సమయాన్ని వెచ్చించవచ్చుని, ప్రాథమిక విధులను మరిచి గంటల పాటు ఇంటర్నెట్ గేమింగ్ వలయంలో చిక్కితే పలు అనారోగ్యాలను ఆహ్వానించినట్లు అవుతుందని మరువరాదు. పిల్లలు, యువతను వీడియో గేమింగ్ రుగ్మత నుంచి తప్పించాల్సిన బాధ్యత తల్లితండ్రులు, కుటుంబ పెద్దలు, ఉపాధ్యాయుల మీద అధికంగా ఉంటుంది.

వీడియో గేమింగ్ దురలవాటుతో క్షణికావేశం, నిరాశ, ఆందోళన, ఒంటరితనం, మానసిక వ్యాకులత, చురుకుదనం కోల్పోవడం, ఆకలి లేకపోవడం, నిద్ర లేమి, స్థూలకాయం, సామాజిక నైపుణ్యాలను కోల్పోవడం, బైపోలార్ రుగ్మతలు, హింసా ప్రవృత్తి పెరగడం, కంటిపై భారం, చిరుప్రాయంలోనే కంటి అద్దాలు రావడం, మెడ/వెన్ను నొప్పులు, పనిలో ఏకాగ్రత లోపించడం, విచిత్ర ప్రవర్తనలు లాంటి తీవ్ర ప్రభావాల్ని చూపే అనారోగ్యాలు కలుగుతాయి. వీడియో గేమింగ్‌తో మానసిక వ్యాకులత దగ్గరి సంబంధాన్ని కలిగి ఉంటుందని పరిశోధనలు వివరిస్తున్నాయి.

### వీడియో గేమింగ్ రుగ్మత లక్షణాలు:

చదువు/ఉద్యోగ/వృత్తి/ఉపాధుల్లో శ్రద లోపించడం, ఎక్కువ సమయం గేమింగ్ గురించి ఆలోచించడం/ఎల్లవేళలా ఆడాలనిపించడం, చికాకు పెరగడం, ఇతరులకు దూరంగా ఉండడం, సామాజిక మానవ సంబంధాలకు చొరవ చూపకపోవడం, తల్లితండ్రులతో అబద్దాలు చెప్పడం, వ్యక్తిగత శుభ్రతకు అయిష్టత చూపడం, బడికి/క్లాసులకు దుమ్మా కొట్టడం, తప్పు చేసినట్లు తలదించుకోవడం లాంటి లక్షణాల ద్వారా గేమింగ్ రుగ్మతలను గుర్తిస్తారు. వీడియో గేమింగ్ క్రీడలను ఆడే వారిలో 'డోపమిన్ రసాయనం' అతిగా విడుదల కావడంతో మెదడు పనితీరు ప్రభావితం అవుతుందని వివరిస్తున్నారు.

ఇంటర్నెట్ గేమింగ్ రుగ్మతల చికిత్సామార్గాలు:

ఇంటర్నెట్ గేమింగ్ లేదా టెక్నాలజీ రుగ్మతలను కట్టడి చేయడానికి 'సైకోథెరపీ లేదా టాక్ థెరపీ' ఉపయోగపడుతుంది. గేమింగ్ డిజార్డర్ చికిత్సకు మానసిక వైద్యులు(సైక్రియాట్రిస్ట్), మనస్తత్వవేత్త(సైకాలజిస్ట్)లను సంప్రదించాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న చికిత్సల్లో 'కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ', 'గ్రూప్ థెరపీ', 'ఫామిలా లేదా మ్యారేజ్ కౌన్సిలింగ్' విధానాలు ప్రయోగిస్తారు. గేమింగ్ రుగ్మతకు చికిత్స కన్న వాటి వలలో పడకుండా తల్లితండ్రులు జాగ్రత్త పడడం ఉత్తమమైన మార్గమని తెలుసుకోవాలి. మానసిక చికిత్సతో పాటు కుటుంబ సభ్యుల పాత్ర, జీవనశైలి మార్పులకు ప్రయత్నించడం లాంటి చర్యలు కూడా సత్ఫలితాలను ఇస్తాయి. డిజిటల్ యుగం తెచ్చిన అభివృద్ధి వరంతో పాటు ఇలాంటి దుష్ప్రభావాలు కూడా శాపంగా మారడం విచారకరం.

వెలుతురు వెంట నీడ, పగలు వెంట రాత్రి, సుఖం వెంట దుఃఖం, శాస్త్ర సాంకేతిక ఉపయోగాల వెంట దుష్ప్రభావాలు జతగా ఉంటాయి. సాంకేతిక కత్తికి ఇరువైపుల పదునుంటుంది. కత్తిని ఏలా వాడుకోవాలో వినియోగదారుడి విజ్ఞతకే వదిలేయాలి. కత్తులతో కూరగాయలను కోయడమే కాదు పీకలు కూడా కోయడం సాధ్యమే. ప్రతి ఒక్కరు ఆధునిక శాస్త్రసాంకేతిక ఆయుధాన్ని మానవాళి సుస్థిరాభివృద్ధికి మాత్రమే వినియోగించుకోవాలని, జాతి తిరోగమన చర్యలకు వినియోగించరాదని తెలుసుకోవాలి. ఈ విషయాలను అర్థం/ఆకలింపు చేసుకొని నేటి యువత తాము ఎదుగుతూ దేశాభివృద్ధిలో పాల్గొనాలని మనసారా ఆశిద్దాం. గేమింగ్ డిజార్డర్‌ను మానవ నివాస బార్డర్ ఆవలికి తరిమేద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# హరియాణా రైతుకు అండగా నిలిచిన పిఎమ్ కిసాన్ సమ్మాన్నిధి

న్యూఢిల్లీ, జనవరి 19:'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' యొక్క లబ్ధిదారుల తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యం ద్వారా భేటీ అయ్యి, వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో దేశవ్యాప్తం గా వేల కొద్దీ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' తాలూకు లబ్ధిదారులు పాలుపంచుకొన్నారు. ఈ సందర్భం లో కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, విధాన సభ లతో పాటు స్థానిక ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

హరియాణా లోని రోహ్‌తక్ కు చెందిన రైతు శ్రీ సందీప్ పిఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి తాలూకు లబ్ధిదారుల లో ఒకరు. ఆయన 11 మంది సభ్యులున్న ఉమ్మడి కుటుంబం లో ఒక సభ్యుడు.

డబ్బులు వారి ఖాతా ల లో నేరు గా జమ అవుతున్న సంగతి తెలియని వ్యక్తులు ఉన్నారన్న విషయాన్ని గురించి ప్రధాన మంత్రి తాను సమావేశం అయిన జన సమూహాని కి వివరించారు. అటువంటి వ్యక్తుల కు వారికి అందే సహాయాన్ని గురించి తెలియజేయడం జరిగింది. సమ్మాన్ నిధి రూపం లో స్వీకరిస్తున్న నగదు ఎరువుల ను, విత్తనాల ను కొనుకోవడం లో ఉపయోగపడుతోందని, వ్యవసాయం చేయడం లో ఈ డబ్బు సాయపడుతోందని ప్రధాన మంత్రి తో శ్రీ సందీప్ చెప్పారు.

ఆహార పదార్థాల పంపిణీ సాఫీ గా సాగుతున్నట్లు ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకు రావడమైంది. హరియాణా ముఖ్యమంత్రి ఈ పథకాన్ని తు.చ. తప్పక అమలు చేస్తున్నారని ప్రధాన మంత్రి గమనించారు. 'మోదీ కీ గ్యారంటీ కీ గాడీ' కి('మోదీ ఇస్తున్న హామీ తాలూకు వాహనాని'కి) ని ఊరి లో ఉత్సాహం గా స్వాగతం పలకడం జరిగింది. సభా స్థలి కి మహిళ లు పెద్ద సంఖ్య లో తరలి రావడాన్ని శ్రీ నరేంద్ర మోదీ గమనించి, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాని కి వారు వారి యొక్క ఆశీర్వాదాలు ఇవ్వాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

న్యూ ఢిల్లీ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ సీఎం జగన్ రెడ్డికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జగన్ బెయిల్ రద్దు చేయాలని ఎంపీ రఘురామ కృష్ణంరాజు వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎంపీ రఘురామకు వ్యతిరేకంగా అనర్హత పిటిషన్ వేసినందునే ఆయన బెయిల్ రద్దు పిటిషన్ వేశారని జగన్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ కేసులో తాము రాజకీయ పరమైన అంశాల జోలికి పోవడం లేదని, కేవలం న్యాయపరమైన అంశాలనే పరిశీలిస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. జగన్ బెయిల్ రద్దు కేసు విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో జాప్యానికి కారణమేంటని, దీనికి బాధ్యులు ఎవరని సుప్రీం ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. డిశ్చార్జ్ పిటిషన్లను విచారించడానికి ఎందుకంత సమయం తీసుకున్నారని సీబీఐని అత్యున్నత న్యాయస్థానం నిలదీసింది. అయితే విచారణ జాప్యంలో, వాయిదాల విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదని సీబీఐ తరపు న్యాయవాది తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా సీబీఐకి సంబంధం లేకపోతే వేరే ఎవరికి సంబంధం ఉంటుదని ప్రశ్నించారు. సీబీఐ, జగన్ కుమ్మక్కై కేసును జాప్యం చేస్తున్నారని ఈ సందర్భంగా పిటిషనర్ ఎంపీ రఘురామ తరపు న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ ఆరోపించారు. దీంతో గతంలో సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హై ప్రొఫైల్ కేసుల విచారణను త్వరిత గతిన పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 15వ తేదీన ఆదేశాలు ఇచ్చిన అంశాన్ని జగన్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టులో ప్రస్తావించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జగన్ కేసుల విచారణ ఎంత త్వరగా తేలుతుందో చూద్దావని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతవరకు కేసుల విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేస్తున్నామని వెల్లడించింది. కాగా ఏపీ సీఎం జగన్ బెయిల్‌ను రద్దు చేయడంతో పాటు జగన్ అక్రమాస్తుల కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ ఎంపీ రఘురామరాజు సుప్రీం కోర్టులో రెండు పిటిషన్లను దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. జగన్ బెయిల్ రద్దు, ట్రాన్స్ ఫర్ పిటిషన్లపై సీబీఐకి గతంలోనే సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో ఆలస్యం ఎందుకు అవుతుందో చెప్పాలని సీబీఐని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది.

# నేతల మధ్య విభేదాల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడి పోయాం : మాజీ స్పీకర్ పోచారం

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): ఖమ్మం జిల్లాలో నేతల మధ్య విభేదాలు ఎక్కువ అయ్యాయని.. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు ఓడి పోయామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నాడు ఖమ్మం పార్లమెంట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇక నుంచి నేతల మధ్య వర్గ విభేదాలు పక్కన పెట్టి రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని.. లేకపోతే పార్టీకి మరింత నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## పోస్టుకార్డు కథల పోటీ

సాహితీకిరణం గౌరవ సంపాదకులు గుదిబండి వెంకటరెడ్డి 83వ జన్మదినం సందర్భంగా సాహితీకిరణం ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డ్ కథలపోటీ నిర్వహిస్తున్నారు. కనుక ఏ ప్రాంతంలో ఉన్న తెలుగు రచయితలైనా సరే, అందరూ ఈ కథలపోటీలో పాల్గొని.. మంచి కథతో తెలుగు కథని పరిపుష్టం చేయవలసిందిగా కోరుతున్నాం. ఈ పోటీలో రూ॥1000/- చొప్పున 5 సమాన బహుమతులు ఉంటాయి.

నియమనిబంధనలు: 1) కథ పోస్టుకార్డ్‌పై మాత్రమే రాయాలి, 2) కేవలం పోస్ట్‌ద్వారా మాత్రమే పంపాలి, 3) కథ సామాజిక స్పృహ కలిగిన ఏ అంశమైనా పర్వాలేదు.4) ఒక రచయిత ఒక్క కథ మాత్రమే పంపాలి, 5)కార్డు వెనుక ప్రక్క కథ స్వంతమనీ, తమ పేరు, సెల్ నెంబర్, హామీపత్రం, చిరునామా రాయాలి,5)బహుమతి పొందిన కథలు సాహితీకిరణం మాసపత్రికలో ప్రచురించబడతాయి, ఇంకా ఎంపికైన 83 కథలతో ఒక పోస్టుకార్డు కథల సంపుటి ప్రచురించబడుతుంది, 6) రచయితలు తమ కథలను ఫిబ్రవరి 29 2024 లోపు ఎడిటర్ సాహితీకిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్-500102 చిరునామాకు పోస్ట్‌ద్వారా పంపాలి. ఫోన్ నెం.9490751681. బహుమతుల విషయంలో ఎటువంటి వాదవివాదాలకు తావులేదు. న్యాయనిర్ణేతల నిబంధనలమేరకు రచయితలు కట్టుబడివుండాలి. పోటీలో గెలుపొందిన విజేతలకు ఏప్రియల్ 2, 2024 హైదరాబాద్ శ్రీ త్యాగరాజ గానసభలో ప్రధాన వేదికపై జరిగే సభలో జ్ఞాపిక, శాలువాతో సత్కారం ఉంటుంది కావున వారు తప్పక విచ్చేసి బహుమతి స్వీకరించవలసివుంటుంది.వివరాలకు 9849882783, 9490751681



బహుమతి ప్రదాత
గుదిబండి వెంకటరెడ్డి



పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు సాహితీకిరణం

# మేఘాలయలోని రీ భోయీ నివాసి అయిన సిల్మే మరాక్ గారి తో 'మీ పల్లె లో మీరే మోదీ' అని పలికిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 19:'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' యొక్క లబ్ధిదారుల తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యం ద్వారా భేటీ అయ్యి, వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో దేశవ్యాప్తం గా వేల కొద్దీ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' తాలూకు లబ్ధిదారులు పాలుపంచుకొన్నారు. ఈ సందర్భం లో కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, విధాన సభ లతో పాటు స్థానిక ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

మేఘాలయ లోని రీ భోయీ అనే ఊరి లో ఉంటున్న సిల్మే మరాక్ గారు తాను నడుపుతున్న ఒక చిన్న దుకాణం స్థాయి నుండి ఒక స్వయం సహాయ సమూహం (ఎస్‌హెచ్‌జి) స్థాయి కి వృద్ధి చెందడం తో ఆమె యొక్క జీవనం మేలు మలుపు తిరిగింది. ప్రస్తుతం ఆమె స్థానిక మహిళల కు స్వయం సహాయ సమూహాల ను ఏర్పాటు చేసుకోవడం లో సాయ పడుతున్నారు. మరి, 50 కి పైగా స్వయం సహాయ సమూహాల ఏర్పాటు లో తన వంతు సాయాన్ని అందించారు. ఆమె పిఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి, బీమా, ఇతర పథకాల లబ్ధిదారుల లో ఒకరు గా ఉన్నారు.

సిల్మే గారు ఇటీవల తన కార్య విస్తరణ కోసం ఒక స్కూటీ ని కొనుగోలు చేశారు. ఆమె తన బ్లాకు పరిధి లో వినియోగదారుల సేవా కేంద్రాన్ని కూడా నడుపుతూ, ప్రభుత్వ పథకాల ను అందుకోవడం లో ప్రజల కు సాయపడుతున్నారు. ఆమెకు చెందిన సమూహం ఫూడ్ ప్రాసెసింగ్ లోను, బేకరీ నిర్వహణ లోను చురుకు గా పని చేస్తోంది. ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రధాన మంత్రి ప్రశంసించారు. ప్రధాన మంత్రి ఆమె గౌరవార్థం చప్పట్లు చరిచారు.

ప్రభుత్వ పథకాల పట్ల సిల్మే గారి కి ఉన్న వ్యావహారిక అనుభవాన్ని మరియు హిందీ భాష మీద ఆమె కు ఉన్న పట్టు ను ప్రధాన మంత్రి గుర్తించి, "మీరు చాలా చక్కగా, బహుశా నా కంటే కూడా మెరుగ్గా మాట్లాడుతున్నారు'' అన్నారు. సామాజిక సేవ పట్ల ఆమె తీసుకొంటున్న శ్రద్ధ ను ప్రధాన మంత్రి ప్రశంసించారు. "మీ వంటి వ్యక్తుల యొక్క సమర్పణ భావమే ప్రభుత్వ పథకాల ప్రయోజనాల ను ప్రతి ఒక్క పౌరుని కి/ప్రతి ఒక్క పౌరురాలి కి చేరవేయాలి అన్న మా సంకల్పాని కి శక్తి ని ప్రసాదిస్తున్నది. మీ వంటి వారి వల్ల నా పని చాలా సులువయిపోతోంది. 'మీ పల్లె లో మీరే మోదీ' " అని ప్రధాన మంత్రి అన్నారు.

# మహిళల్లో అవగాహన పెంచుతున్న వ్యవస్థాపకురాలికి ప్రధానమంత్రి ప్రశంస

న్యూఢిల్లీ, జనవరి 19: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ వికసిత భారత్ సంకల్పయాత్ర లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా సంభాషించారు. దేశవ్యాప్తంగాగల యాత్ర లబ్ధిదారులు కూడా ఇందులో పాలుపంచుకున్నారు. అలాగే కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ మేరకు రాజస్థాన్ రాష్ట్రంలోని దుంగార్పూర్ గ్రామంలో 'గ్రామీణ అజీవిక మిషన్' కింద స్వయం ఉపాధి పొందుతున్న స్వయం సహాయ సంఘం సభ్యురాలు శ్రీమతి మమత ధింధోర్‌తో ప్రధానమంత్రి సంభాషించారు. ఆమె గుజరాతీ భాషలోనూ మాట్లాడగలగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐదుగురు సభ్యులున్న ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన ఆమె, 150 సంఘాల్లోని 7500 మంది మహిళల తో కలసి పనిచేస్తుండటాన్ని కొనియాడారు. మహిళల్లో అవగాహన కల్పించడం.. శిక్షణ ఇవ్వడం.. సంఘాల సభ్యులు రుణం పొందడంలో ఆమె నిస్వార్థంగా సహాయం చేస్తుంటారు.

కూరగాయల సాగు కోసం బోరు వేసుకునేందుకు స్వయంగా రుణం పొందిన ఆమె, కూరగాయల దుకాణం కూడా నడుపుతున్నారు. శ్రీమతి మమత వ్యవసాయం, వ్యాపారం ద్వారా మరికొందరికి ఉపాధి కూడా కల్పిస్తుండటం గమనార్హం. పక్కా ఇల్లు నిర్మించుకోవాలన్న తన కల పిఎం ఆవాస్ యోజనతో నెరవేరిందని ప్రధానితో ముచ్చటిస్తూ ఆమె వెల్లడించారు. ప్రభుత్వం నుంచి సహాయంగా అందే సొమ్ము, దాన్ని పొందే అవినీతిరహిత ప్రక్రియ గురించి ఆమె ప్రధానికి వివరించారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పిస్తుంటానని, అదే తరహాలో 'మోదీ హామీ వాహనం' గురించి కూడా అందరికీ చైతన్యం కల్పించానని వివరించారు. ఈ వాహనం ద్వారా దరఖాస్తు సమర్పించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందాల్సిందిగా ప్రజల్లో ప్రచారం చేశారు.

శ్రీమతి మమతతో ముచ్చటించిన అనంతరం, ఆధునిక ప్రపంచంపై ఆమెకున్న అవగాహనను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ నేపథ్యంలో ఆమె సంఘంలోని మహిళా సభ్యులు కార్యక్రమాన్ని వీడియో తీయడం ఆయన గమనించారు. అటుపైన అక్కడ హాజరైన మహిళా వ్యవస్థాపకులతో కాసేపు మాట్లాడారు. "దుంగార్పూర్ వంటి ఒక చిన్న గ్రామంలో నా తల్లులు.. సోదరీమణులు చాలా సంతోషంగా ఉన్నారు. నన్నెంతో ప్రేమాభిమానాలతో ఆశీర్వదిస్తుండటం మహదానందం కలిగిస్తోంది" అని ప్రధాని సహర్షంగా వ్యాఖ్యానించారు. స్వయంగా ముందంజ వేయడంతోపాటు ఇతర మహిళలను తన వెంట నడిపించడంలో శ్రీమతి మమత చూపుతున్న ఉత్సాహాన్ని, అంకిత భావాన్ని కూడా శ్రీ మోదీ ప్రశంసించారు. తమ ప్రభుత్వం గత 9 ఏళ్లుగా స్వయం సహాయ సంఘాల ద్వారా మహిళల సాధికారతకు కృషి చేస్తున్నదని గుర్తుచేశారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 2 కోట్ల మంది 'లక్షాధికారి సోదరీమణుల' సృష్టి దిశగా చేపట్టిన ప్రణాళిక గురించి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆమె వంటి స్వయం సహాయ సంఘాల సభ్యుల కీలక పాత్రను ప్రధాని నొక్కిచెప్పారు.

# ఇదెంతో గొప్ప సేవ... ముంబై నివాసి కల్పనకు ప్రధానమంత్రి ప్రశంస

న్యూఢిల్లీ, జనవరి 19: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ వికసిత భారత్ సంకల్పయాత్ర లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా సంభాషించారు. దేశవ్యాప్తంగాగల యాత్ర లబ్ధిదారులు కూడా ఇందులో పాలుపంచుకున్నారు. అలాగే కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ముంబైలో 'సాయి కిన్నర్ పొదుపు స్వయం సహాయ సంఘం' నిర్వహిస్తున్న లింగమార్పిడి వ్యక్తి కల్పనా బాయితో మాట్లాడారు. మహారాష్ట్రలో లింగమార్పిడి వ్యక్తుల కోసం మొట్టమొదట స్వయం సహాయ సంఘం ఏర్పాటు చేసిన వ్యక్తి కల్పన కావడం గమనార్హం. ఆమె ప్రధానితో ముచ్చటిస్తూ తన జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని తెలిపారు. తమవంటి వారిపై ప్రధానమంత్రి అవగాహనకు, సాదర భావనకు ముందుగా ధన్యవాదాలు తెలిపారు. తమవంటి వారికి జీవితం ఎంతో కఠినంగా ఉంటుందని గుర్తుచేస్తూ– పొదుపు సంఘం ప్రారంభించడానికి ముందు భిక్షాటన చేస్తూ, అస్థిర జీవన పరిస్థితులతో పోరాడాల్సి వచ్చిందని ప్రధానికి చెప్పారు.

ప్రభుత్వ ఆర్థిక సహాయంతో కల్పన తొలుత బుట్టల తయారీని ప్రారంభించారు. పట్టణ జీవనోపాధి కార్యక్రమంతోపాటు, స్వానిధి పథకం కింద ఆమెకు ప్రభుత్వం నుంచి మరింత చేయూత లభించింది. దీంతో ఇడ్లీ–దోసె, పూల వ్యాపారం కూడా నిర్వహిస్తున్నారు. ముంబైలో ప్రతి ఒక్కరికీ సుపరిచితమైన పావ్–భాజీ, వడా–పావ్ వ్యాపారం చేస్తే ఎలా ఉంటుందంటూ ప్రధాని సరదాగా కల్పనను ఆరా తీసినపుడు అందరూ చిరునవ్వు చిందించారు. ఆమె తన వ్యవస్థాపక చొరవ ద్వారా లింగమార్పిడి వ్యక్తుల జీవన వాస్తవికతపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు కిన్నరల పట్ల ప్రజల్లోగల దురవగాహనను దూరం చేయడంలో చేసిన కృషిని అభినందించారు. తద్వారా సమాజానికి ఆమె చేసిన సేవ ఎంతో గొప్పదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "కిన్నరులు ఏం చేయగలరో మీరు చేతల్లో చూపించారు" అని కల్పనను కొనియాడారు.

కల్పన నేతృత్వంలోని స్వయం సహాయ సంఘం ప్రస్తుతం లింగమార్పిడి వ్యక్తులకు గుర్తింపు కార్డులు అందజేస్తోంది. అలాగే బిచ్చమెత్తడం వదిలి, స్థిరమైన జీవితం దిశగా వ్యాపారం ప్రారంభించేలా 'పిఎం స్వానిధి' పథకాలను సద్వినియోగం చేసుకోవడంపై కిన్నర సమాజ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. 'మోదీ హామీ వాహనం' కిన్నర సమాజానికి ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని ఆమె ఆనందం వెలిబుచ్చారు. ఈ వాహనం తమ ప్రాంతానికి వచ్చినపుడు తనతోపాటు ఎందరో మిత్రులు కూడా చాలా ప్రయోజనాలు పొందారని తెలిపారు. కల్పన అలుపెరగని స్ఫూర్తికి ప్రధాని మోదీ అభివందనం చేశారు. ఎన్నో సవాళ్లతో కూడిన జీవితం గడిపినప్పటికీ ఇప్పుడామె ఉపాధి ప్రదాతగా మారారని ప్రశంసించారు. ఈ సందర్భంగా "మా లక్ష్యం అణగారిన వర్గాలకు అండదండగా నిలవడమే"నని అని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు.

# 550 ఏళ్ల హిందువుల కల- అయోధ్యలో 22న సాకారం - జీవీఎల

అమరావతి, జనవరి 19: అయోధ్యలో శ్రీరాముడి ఆలయ నిర్మాణం 550 ఏళ్ల కల అని, జనవరి 22వ తేదీ భారత దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు భారతీయ జనతా పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు.. శ్రీకాకుళంలో ఇవాల మీడియాతో ఆయన మాట్లాడుతూ? జనవరి 22వ తేదీ భారత చరిత్రలో ఒక మరవరాని రోజుగా ఉంటుందన్నారు. ప్రపంచంలోని హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముడు అన్నారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం 550 సంవత్సరాల కలగా పేర్కొన్నారు.

హిందూ బాహుల్య దేశమైన భారతదేశంలో కొన్ని పార్టీల తప్పుడు నిర్ణయాల కారణంగా హిందువులు దెబ్బతిన్నారని విమర్శించారు. ఇక, అయోధ్యలో రాముడు ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని కాంగ్రెస్ బాయికాట్ చేయడం దారుణమన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఇది పరాకాష్టగా ఆరోపించారు. దేశ ప్రజలు సంతోషంగా ఉన్న సమయంలో ప్రతిష్టను తగ్గించాలన్న దురాలోచనతో విపక్షాలు ఉన్నాయని ఆయన మండిపడ్డారు.

# హరిత ప్రాంగణంగా హనుమకొండ

## –జిల్లా కలెక్టరేట్ కలెక్టర్ సిక్తా పట్నాయక్.



హన్మకొండ, జనవరి 19: (నేటినిజం ప్రతినిధి): వివిధ రకాల మొక్కలతో హరిత ప్రాంగణంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ రూపుద్దిద్దుకుంటుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ వివిధ రకాల పూల మొక్కలతో పాటు, ఆకర్షణీయమైన మొక్కలను ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రాంగణంలో మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ పదివేల మొక్కలను నాటి హరిత ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా వివిధ రకాల మొక్కలను నాటడం జరిగిందన్నారు. కలెక్టరేట్ ఆవరణ మొత్తం పచ్చదనంతో ప్రశాంత వాతావరణం ఉట్టిపడే విధంగా వేలాది మొక్కలను నాటినట్లు తెలిపారు. కలెక్టరేట్ లోని నాటిన మొక్కల సంరక్షణకు ఉద్యాన శాఖ అధికారులు,సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు ఎప్పుడు పచ్చదనంతో కళకళలాడే విధంగా సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డిఆర్ఓ వై.వి.గణేష్, డిఆర్డిఓ శ్రీనివాస్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 20-21 తేదీలలో తమిళనాడులోని పలు దేవాలయాలను సందర్శించనున్న ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 19:జనవరి 20వ తేదీ ఉదయం 11 గంటలకు తమిళనాడులోని తిరుచిరాపల్లిలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో జరిగే కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. ఈ ఆలయంలో వివిధ పండితులు కంబ రామాయణం నుండి పద్యాలను పఠించడాన్ని కూడా ప్రధాన మంత్రి వింటారు.

ఆ తర్వాత, ప్రధాని మధ్యాహ్నం 2 గంటలకు రామేశ్వరం చేరుకుని, శ్రీ అరుల్మిగు రామనాథస్వామి ఆలయంలో దర్శనం చేసుకుని పూజలు నిర్వహిస్తారు. గత కొన్ని రోజులుగా ప్రధానమంత్రి పలు దేవాలయాలను సందర్శిస్తున్న నేపథ్యంలో, ఈ ఆలయంలో వివిధ భాషలలో (మరాఠీ, మలయాళం మరియు తెలుగు వంటి) రామాయణ పఠనానికి హాజరవుతున్నప్పుడు పాటించే ఆచారాన్ని కొనసాగిస్తూ, ఆయన ఒక కార్యక్రమానికి హాజరవుతారు - 'శ్రీ రామాయణ పర్యాణ '. కార్యక్రమంలో, ఎనిమిది వేర్వేరు సంప్రదాయ మండలులు సంస్కృతం, అవధి, కాశ్మీరీ, గురువ ఖి, అస్సామీ, బెంగాలీ, మైథిలి మరియు గుజరాతీ రామకథలను (శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని వివరిస్తారు) పఠిస్తారు. ఇది 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'లో ప్రధానమైన భారతీయ సాంస్కృతిక తత్వానికి ఉ బంధానికి అనుగుణంగా ఉంటుంది. శ్రీ అరుల్మిగు రామనాద స్వామి ఆలయంలో, సాయంత్రం ఆలయ సముదాయంలో బహుళ భక్తి గీతాలు పాడే భజన సంధ్యలో కూడా ప్రధాన మంత్రి పాల్గొంటారు.

జనవరి 21వ తేదీన ధనుష్కోడిలోని కోదండరామస్వామి ఆలయంలో ప్రధానమంత్రి దర్శనం, పూజలు చేస్తారు. ధనుష్కోడి సమీపంలో, రామసేతు నిర్మించిన ప్రదేశంగా చెప్పబడే అరిచల్ మునైని కూడా ప్రధాని సందర్శిస్తారు.

శ్రీరంగం, తిరుచ్చిలో ఉన్న ఈ ఆలయం దేశంలోని అత్యంత పురాతన ఆలయ సముదాయాలలో ఒకటి. పురాణాలు, సంగం యుగం గ్రంథాలతో సహా వివిధ పురాతన గ్రంథాలలో ప్రస్తావనను పొందింది. ఇది దాని నిర్మాణ వైభవానికి మరియు అనేక ఐకానిక్ గోపురాలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పూజించబడే ప్రధాన దైవం శ్రీ రంగనాథ స్వామి, భగవాన్ విష్ణువు యొక్క శయన రూపం. వైష్ణవ గ్రంథాలు ఈ ఆలయంలో పూజించే విగ్రహానికి, అయోధ్యకు మధ్య ఉన్న సంబంధాన్ని పేర్కొంటున్నాయి. శ్రీరాముడు, పూర్వీకులు పూజించే విష్ణుమూర్తి విగ్రహాన్ని లంకకు తీసుకెళ్లడానికి విభీషణుడికి ఇచ్చాడని నమ్మకం. దారిలో ఈ విగ్రహం శ్రీరంగంలో స్థిరపడింది.

గొప్ప తత్వవేత్త, సన్యాసి శ్రీ రామానుజాచార్యులు కూడా ఈ ఆలయ చరిత్రతో లోతైన సంబంధం కలిగి ఉన్నారు. అంతేకాకుండా, ఈ ఆలయంలో అనేక ముఖ్యమైన ప్రదేశాలు ఉన్నాయి - ఉదాహరణకు, ప్రసిద్ధ కంబ రామాయణం ఈ కాంప్లెక్స్‌లోని ఒక నిర్దిష్ట ప్రదేశంలో తమిళ కవి కంబన్ చేత మొదటిసారిగా బహిరంగంగా ప్రదర్శించబడింది.

ఈ ఆలయంలో ప్రధాన దైవం శ్రీ రామనాథస్వామి, ఇది భగవాన్ శివ స్వరూపం. ఈ ఆలయంలోని ప్రధాన లింగం శ్రీరాముడు, సీత మాతచే ప్రతిష్ఠించబడి పూజించబడిందని విస్తృతంగా నమ్ముతారు. ఈ ఆలయంలో పొడవైన ఆలయ కారిడార్ ఒకటి ఉంది, ఇది అందమైన వాస్తుశిల్పానికి కూడా ప్రసిద్ధి చెందింది. ఇది చార్ ధామ్‌లలో ఒకటి - బద్రీనాథ్, ద్వారక, పూరి మరియు రామేశ్వరం. 12 జ్యోతిర్లింగాలలో ఇది కూడా ఒకటి.

ఈ ఆలయం శ్రీ కోతండరామ స్వామికి అంకితం చేయబడింది. కోతండరాముడు అంటే విల్లుతో ఉన్న రాముడు. ఇది ధనుష్కోడి అనే ప్రదేశంలో ఉంది. విభీషణుడు శ్రీరాముడిని మొదటిసారిగా కలుసుకుని శరణు కోరింది ఇక్కడే అని చెబుతారు. శ్రీరాముడు విభీషణుని పట్టాభిషేకం జరిపించిన ప్రదేశం ఇదేనని కూడా కొన్ని పురాణాలు చెబుతున్నాయి.

# శ్రీ రామ జన్మభూమి ఆలయానికి అంకితం చేసిన ఆరు స్మారక తపాలా స్టాంపులను విడుదల చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 19:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు శ్రీ రామ జన్మభూమి ఆలయానికి అంకితం చేస్తూ ఆరు ప్రత్యేక స్మారక తపాలా స్టాంపులను విడుదల చేశారు, అలాగే ప్రపంచంలోని వివిధ దేశాలలో ఇంతకు ముందు విడుదల చేసిన శ్రీరాముడికి సంబంధించిన స్టాంపులతో కూడిన ఆల్బమ్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా భారతదేశం మరియు విదేశాలలో ఉన్న శ్రీరామ భక్తులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

లేఖలు, ముఖ్యమైన పత్రాలను పంపడానికి ఈ స్టాంపులను ఎన్వలప్ లపై అతికించారని మనందరికీ తెలుసునని ప్రధాని అన్నారు. కానీ అవి మరొక ప్రయోజనాన్ని కూడా అందిస్తాయి. తపాలా స్టాంపులు చారిత్రక సంఘటనలను భవిష్యత్ తరాలకు అందించడానికి మాధ్యమంగా కూడా పనిచేస్తాయి. కాబట్టి మీరు పోస్టల్ స్టాంప్‌తో ఎవరికైనా లేఖ లేదా వస్తువును పంపినప్పుడల్లా, మీరు వారికి చరిత్ర భాగాన్ని కూడా పంపుతున్నారు. ఈ టిక్కెట్లు కేవలం కాగితం ముక్క మాత్రమే కాదు, చరిత్ర పుస్తకాలు, కళాఖండాలు, చారిత్రక ప్రదేశాలలో అతి చిన్న రూపం.

ఈ స్మారక స్టాంపులు మన యువ తరానికి శ్రీరాముడు, అతని జీవితం గురించి తెలుసుకోవడానికి కూడా సహాయపడతాయని ప్రధాన మంత్రి అన్నారు. ఈ స్టాంపులపై కళాత్మక వ్యక్తీకరణ ద్వారా శ్రీరాముని పట్ల భక్తి వ్యక్తీకరించబడిందని, ప్రముఖ చతుర్భుజం: 'మంగళ భవన్ అమంగల్ హారీ' ప్రస్తావనతో దేశం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ స్టాంపులపై సూర్యుడు, 'సూర్యవంశీ' రాముని చిహ్నం, 'సరయు' నది, ఆలయ అంతర్గత నిర్మాణం కూడా చిత్రీకరించబడ్డాయి. సూర్యుడు దేశంలో కొత్త కాంతి సందేశాన్ని ఇస్తున్నప్పుడు, సరయు చిత్రం రాముడి ఆశీర్వాదంతో దేశం ఎల్లప్పుడూ చైతన్యవంతంగా ఉంటుందని సూచిస్తుంది.

స్మారక స్టాంపులను రూపొందించడంలో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌తో పాటు పోస్టల్ శాఖకు మార్గనిర్దేశం చేసిన సాధువులను కూడా ప్రధాన మంత్రి ప్రశంసించారు.

రాముడు, సీతమ్మ తల్లి, రామాయణానికి సంబంధించిన బోధనలు సమయం, సమాజం, కులాల సరిహద్దులకు అతీతంగా ఉన్నాయని, అక్కడ ఉన్న ప్రతి వ్యక్తికి అనుసంధానం అవుతాయని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. అత్యంత కష్టకాలంలోనూ ప్రేమ, త్యాగం, ఐక్యత, ధైర్యం, గురించి బోధించే రామాయణం యావత్ మానవాళిని అనుసంధానం చేస్తుందన్నారు. అందుకే రామాయణం ప్రపంచంలో ఎప్పుడూ దృష్టి కేంద్రీకరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా శ్రీరాముడు, సీత, రామాయణాలు ఎంత గర్వంగా కనిపిస్తున్నాయో ఈ రోజు ఆవిష్కరించిన పుస్తకాలు ప్రతిబింబిస్తున్నాయని అన్నారు.

అమెరికా, ఆస్ట్రేలియా, కంబోడియా, కెనడా, చెక్ రిపబ్లిక్, ఫిజీ, ఇండోనేషియా, శ్రీలంక, న్యూజిలాండ్, థాయిలాండ్, గయానా, సింగపూర్ వంటి అనేక దేశాలు రాముడి జీవిత విశేషాలపై ఆసక్తితో పోస్టల్ స్టాంపులను విడుదల చేశాయి. శ్రీరాముడి గురించి, జానకి మాత కథల గురించిన సమస్త సమాచారంతో కొత్తగా విడుదల చేసిన ఈ ఆల్బమ్ వారి జీవితాల గురించి మనకు అవగాహన కల్పిస్తుందని అన్నారు. భారతదేశం వెలుపల రాముడు ఎంత గొప్ప చిహ్నంగా ఉన్నాడో, ఆధునిక కాలంలో దేశాలు కూడా అతని పాత్ర ఎలా ప్రశంసించబడుతుందోమనకు తెలుపుతుంది. వాల్మీకి మహర్షి చేసిన ప్రార్థన నేటికీ అజరామరమని, అందులో ఆయన ఇలా అన్నారు: ? యావత్ స్థాస్యంతి గిరయః, సరితశ్చ మహీతలే. తావత్ రామాయణకథా, లోకేషు ప్రచారతి? అంటే భూమిపై పర్వతాలు, నదులు ఉన్నంత కాలం రామాయణ కథే ప్రజల్లో ఉంటుంది. కాబట్టి, రాముడి వ్యక్తిత్వం ఉంటుంది.

# అక్కడ విదేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకే కాంగ్రెస్ నాయకుల విదేశీ పర్యటనలు

## -తెలంగాణకు బీఆర్ఎస్ తీసుకొచ్చిన రూ. 21 వేల కోట్ల పెట్టుబడులు ఎక్కడికి వెళ్లాయి

### -బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వివిఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ విదేశీ పర్యటనలకు వెళున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకే వెళున్నారు తప్పితే తెలంగాణకు పెట్టుబడులు తేవడానికి కాదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వివిఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి వ్యవహారం చూస్తే.. ఒకవైపు పెట్టుబడుల కోసం అదానీ బృందంతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పుకుంటారు. కాని, ఆ పెట్టుబడులు ఎక్కడికి పోయాయనేదానిపై స్పష్టతనివ్వరని దుయ్యబట్టారు. కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి అదానీ బృందంతో సమావేశమై.. తిరిగి అదానీ, అంబానీ, నరేంద్ర మోదీ గారిపై రాజకీయ విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవపట్టించడంలో భాగమేనని, దీన్ని ప్రజలు గమనించాలని తెలిపారు. తెలంగాణకు రూ. 21 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పెట్టుబడులు ఎక్కడికి వెళ్లాయో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ లో భాగంగా దావోస్ లో పర్యటించి అదానీ గ్రూప్ తో సమావేశమై తెలంగాణలో రూ. 12 వేల కోట్ల మేర పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గొప్పలు చెప్పుకున్నారని,ఇదే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు.. సమయమొచ్చినప్పుడల్లా బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అదానీ-అంబానీ, నరేంద్ర మోదీ గారి పట్ల దుష్ప్రచారం చేశాయి. దేశ సంపదను దోచిపెడుతున్నట్లుగా పదేపదే విమర్శిస్తూ ప్రకటనలు చేశాయన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే దావోస్ పర్యటనకు వెళ్లి అదానీ బృందంతో చర్చలు జరిపి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లుగా చెప్పారు.కేటీఆర్ కూడా గతంలో తెలంగాణ ప్రతినిధిగా ఐదుసార్లు దావోస్ పర్యటనకు వెళ్లి రూ. 21 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నామని సార్వత్రిక ఎన్నికల ముందు ప్రకటనలు గుప్పించారు. అసలు ఆ పెట్టుబడులు ఎక్కడ పెట్టారనేది ఎవ్వరికీ తెలియదని,మరి వీళ్లు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కు వెళ్లేది పెట్టుబడులు తేవడానికా... లేదా పెట్టుబడులు పెట్టేందుకా..?అని ప్రశ్నించారు.దావోస్ సమావేశాల అంశంలో బీఆర్ఎస్-కాంగ్రెస్ రెండు పార్టీలు పోటీపోటీగా వ్యవహరించాయని విమర్శించారు. గతంలో కేసీఆర్ కూడా అదే అదానీతో ప్రత్యేకంగా సమావేశమై మంతనాలు జరిపారు. తర్వాత కేటీఆర్ కూడా అదానీ గ్రూప్ తో కలవడం, మంతనాలు జరిపడం.. అనంతరం భారతీయ జనతా పార్టీపై రాజకీయ విమర్శలు చేశారు.అదే బీఆర్ఎస్ కోవలోనే మొన్న అదానీతో సమావేశమైన రేవంత్ రెడ్డితో పాటు.. కేసీఆర్, కేటీఆర్ గతంలో ప్రతి సభలో, బహిరంగ సభలో ఎక్కడికెళ్లినా అదానీ, అంబానీలకు మోదీ దోచిపెట్టారంటూ కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇదే రీతిలో భారతీయ జనతా పార్టీపై విమర్శలు చేశారన్నారు.కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి వ్యవహారం.. ఒకవైపు పెట్టుబడుల కోసం అదానీతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పుకుంటారు. కాని, ఆ పెట్టుబడులు ఎక్కడికి పోయాయనేదానిపై స్పష్టత లేదని,తెలంగాణకు రూ. 21 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పెట్టుబడులు ఎక్కడికి వెళ్లాయో ఎందుకు చెప్పలేదన్నారు. విదేశీ పర్యటనలకు వెళ్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పెట్టుబడులు పెట్టేందుకే వెళ్తున్నారు.. అంతేగానీ పెట్టుబడులు తేవడానికి కాదు.బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అదానీ, అంబానీలను విమర్శిస్తూ.. మరోవైపు వారితో కలిసి సమావేశమై భోజనాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలను గమనించాలన్నారు.జనవరి 22వ తేదీ.. యావత్ భారత జాతి ఎంతో ఆనందంగా ఎదురుచూస్తున్న రోజన్నారు.అయోధ్యలో భవ్య, దివ్య మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం కోసం జరుగుతున్న క్రతువు ప్రారంభమైంది.ఈ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీలు రాజకీయం చేస్తున్నాయి. భారతదేశ పౌరుల మనోభావాలను ఈ పార్టీలు ఏనాడు గౌరవించలేదు.రాముడు జన్మస్థలం అయోధ్య అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన తర్వాత శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు ద్వారా కేంద్ర ప్రభుత్వం రామమందిర నిర్మాణానికి ముందడుగు వేసిందన్నారు. అయితే, కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీలు కళ్లు తెరవకుండా కుహనా లౌకికవాదం, అవకాశవాద ధోరణిని అవలంభిస్తూ విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా భారత జాతికి క్షమాపణలు చెప్పాలని ఆ మూడు పార్టీలను భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేసారు. ఇప్పటికే జనవరి 22వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు హాఫ్ డే గా ప్రకటించింది.తెలంగాణ ప్రభుత్వం జనవరి 22 వ తేదీ పవిత్రతను దృష్టిలో పెట్టుకుని, చిరకాల వాంఛ నెరవేరుతున్న భారతీయుల మనోభావాలను గౌరవించేలా ఆ రోజున అధికారికంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల నుంచి అయోధ్య రామమందిర విగ్రహ ప్రతిష్ఠాపన కోసం సంప్రదాయబద్ధంగా చేయాల్సిన సత్కార్యాలు, ఆభరణాలు, వస్త్రాలను అందజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకురావాలని ప్రభాకర్ డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు రాములు, మురళీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పల్లంరాజు ఛైర్మన్‌గా 11మందితో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ




అమరావతి, జనవరి 19:ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వివిధ పార్టీ అధినేతలు ఇప్పటికే తమ మేనిఫెస్టో రూపకల్పనపై కసరత్తు మొదలు పెట్టాయి. ప్రజలకు ఖచ్చితమైన హామీలు ఇచ్చి నేరవేర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది.ఏపీ రాష్టానికి సంబంధించి ప్రజారంజక మేనిఫెస్టోను రూపకల్పనకు ఏఐసీసీ కమిటీని ప్రకటించింది. మొత్తం 11 మంది సభ్యులకు కమిటీలో చోటు కల్పించారు. చైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, సభ్యులుగా మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, పార్టీ సీనియర్ నేత తులసి రెడ్డి, కమలమ్మ, జంగా గౌతమ్, ఉషా నాయుడు, నజీరుద్దీన్, కొరివి వినయ్ కుమార్, డాక్టర్ గంగాధర్, కారుమంచి రమాదేవిలను నియమించారు. ఇప్పటికే ఏపీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిలను ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ వచ్చింది. ఇన్నాళ్లు అజ్ఞాతంలోకి వెళ్లిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వరుస ప్రెస్ మీట్లు పెడుతూ ఎన్నికల రణరంగంలోకి కాంగ్రెస్ పార్టీ కూడా దిగిదంటూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు.

# అక్షింతలు, రేషన్ బియ్యం అనే వారికి ఇంట్లో అక్షింతలు తప్పవు

## -వాటి ప్రాముఖ్యత, పవిత్రత తెలియయక అలామాట్లడుతున్నారు: బండి

కరీంనగర్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పొన్నం ప్రభాకర్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అనడం మంచి పద్దతి కాదని, అక్షింతలు అంటే ఏమిటో కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకోవాలన్నారు. అక్షింతల ప్రాముఖ్యత గురించి తెలియకుండా మాట్లాడవద్దని సూచించారు. రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని రాజకీయం చేయొద్దని కోరారు. గురువారం కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల చిరకాల వాంఛ ఈ నెల 22వ తేదీన నెరవేరబోతోందని హర్షం వ్యక్తం చేశారు. హిందూ బంధువుల సహకారంతో దివ్యమైన, భవ్యమైన రామాలయ నిర్మాణం పూర్తయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశంలోని ఆలయాలను శుద్ధి చేస్తున్నామని, అక్షింతల కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని చెప్పారు. అక్షింతలు, రేషన్ బియ్యం అనే వారికి వాటి ప్రాముఖ్యత, పవిత్రత తెలియదన్నారు.

# తరగని సంపద వేమన పద్యాలు-కడప కలెక్టర్ వి.విజయ్ రామరాజు



అమరావతి, జనవరి 19: సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషను సరళంగా వర్ణించిన ప్రజాకవి యోగి వేమన అని, ఆయన కూర్చిన ఆటవెలది పద్యాలు తెలుగు సాహితీ రంగంలో తరగని సంపద అని కడప జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు అభివర్ణించారు. కలెక్టరేట్ లోని స్పందన హాలులో యోగి వేమన జయంతి వేడుకలు జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు అధ్యక్షతన ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ? ఆటవెలది పద్యాల రూపంలో సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే వాడుక భాషలో అద్భుతమైన కవిత్వాన్ని అందించిన ఘనత యోగివేమన సాహితీ ప్రత్యేకత అన్నారు. సామాజిక రుగ్మతలపై, సమాజ సంస్కరణకు కృషి చేసిన గొప్ప దార్శనికుడు వేమన అన్నారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసి.. అరుదైన స్థానాన్ని పొందిన మహనీయుడని కొనియాడారు. భాషను, భావాన్ని ప్రజలకు చేరువ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.వేమన ప్రతి రంగాన్ని నిశితంగా పరిశీలించి నాటి సమాజంలో జరిగే అక్రమాలపై తనదైన శైలిలో నిర్భయంగా నిజాయితీగా వర్ణించారన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత జీవితంలో కుటుంబంతో సంతోషంగా ఉంటే ఉద్యోగ విషయాల్లో కూడా సంతోషంగా పనిచేయగలుగుతామని పేర్కొన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను పెంపొందించే కావ్యాలను.. యువత ఆదర్శంగా తీసుకొని నవ సమాజ సంస్కరణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. అంతకుముందు యోగి వేమన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాతియుగమా.. స్వర్ణయుగమా తేల్చుకోండి : చంద్రబాబు



అమరావతి, జనవరి 19: మరో 82 రోజుల్లో రానున్న ఎన్నికల్లో రాతియుగాన్ని తలపించే జగన్ పాలన కావాలో, తెలుగుదేశం- జనసేన ఇచ్చే స్వర్ణయుగం పాలన కావాలో తేల్చుకోవాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. రా కదలి రా పేరుతో నిర్వహించే సభల పరంపరలో భాగంగా ఈరోజు ఆయన తిరుపతి జిల్లా వెంకటగిరి సభలో పాల్గొన్నారు. ఆ సభలో చంద్రబాబు మాట్లాడుతూ? సమాజంలోని ఏ వర్గాన్ని వదలకుండా దోచుకుంటున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఓటును వజ్రాయుధంగా వినియోగించాలన్నారు. అలవికానీ హామీలు ఇచ్చి ఒక్క అవకాశం ఇవ్వండి అంటే నమ్మి అధికారం అప్పగించినందుకు కనకపు సింహాసనంపై శునకాన్ని కూర్చోపెట్టినట్టు అయ్యిందన్నారు. ఈ సందర్భంగా కనకపు సింహాసనంపై శునకంను కూర్చుండబెట్టి.. అనే సుమతి శతక పద్యాన్ని చదివి వినిపించారు. తాను వెంకటగిరి-శ్రీసిటీ-తిరుపతి మధ్య ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా చేయాలని చూస్తే జగన్ రకరకాల మాఫియాలతో దోపిడీ చేసాడని ఆరోపించారు. ఇందుకు తగినట్టుగా తిరుపతి లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు ఇసుక, గనుల దోపిడీ, భూకబ్జాలతో దోచుకుంటున్నారని విమర్శించారు. తప్పు అన్నందుకు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని పక్కన పెట్టి మరో దోపిడీదారును ఇన్ ఛార్జ్ చేశారన్నారు.సత్యవేడు ఎమ్మెల్యేను రబ్బర్ స్టాంప్ గా మార్చిన మైనింగ్ డాన్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి దోచుకుంటున్నారని ఆరోపించారు. అధికారంతో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసి రాతియుగం పాలన అందిస్తున్న జగన్ కావాలో, అన్ని వర్గాలకు మేలుచేస్తూ అభివృద్ధి సంక్షేమం అందించే తెలుగుదేశం జనసేన ఉమ్మడి పాలన అందించే స్వర్ణయుగం పాలన కావాలో తేల్చుకోవాలని చంద్రబాబు పిలుపు నిచ్చారు. 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా, 15 ఏళ్ళు ప్రతిపక్ష నేతగా పనిచేసిన తాను ఎన్నో పదవులు చూశానని, ఇప్పుడు రాష్ట్రం భవిష్యత్ కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటానని, తనకు పదవుల కన్నా రాష్ట్ర సంక్షేమమే ముఖ్యమని అన్నారు.

# వీబీఎస్ వై ద్వారా తమ కలలను ప్రభుత్వం సాకారం చేస్తోందని ప్రజలు నమ్ముతున్నారు- డాక్టర్ జితేంద్ర సింగ్




న్యూఢిల్లీ, జనవరి 19:వికసిత భారత్ సంకల్ప యాత్ర (విబిఎస్ వై) సామాన్య పౌరుడిలో ఆకాంక్ష, గౌరవాన్ని పెంచి రాజకీయ, అధికారిక స్థాయిలో పని సంస్కృతిలో మార్పును తీసుకువచ్చిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) పీఎంవో, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్, అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. వికసిత భారత్ లబ్ధిదారులతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో నిర్వహించిన భేటీలో జమ్మూ నుంచి ఈరోజు మంత్రి పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు తెచ్చిందని మంత్రి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు మెరుగు పడిందని శ్రీ జితేంద్ర సింగ్ తెలిపారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమైన తర్వాత ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మంత్రి చెప్పారు.

గతంలో పనులు కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అనేక సార్లు తిరగాల్సి వచ్చేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసినా పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు విసుగు చెంది నిరాశకు గురి కావాల్సి వచ్చేదని మంత్రి అన్నారు. అయితే, ప్రస్తుతం వ్యవస్థలో సమూల మార్పు వచ్చి పనులు తక్షణం పూర్తి అవుతున్నాయని మంత్రి వివరించారు.

వీబీఎస్ వై ద్వారా తమ కలలను ప్రభుత్వం సాకారం చేస్తోందని ప్రజలు నమ్ముతున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు కార్యరూపం దాలుస్తున్నాయని తెలిపారు. పేద బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు పీఎం ఆవాస్ యోజన కింద సొంత ఇళ్లు లభించాయని శ్రీ జితేంద్ర సింగ్ తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అమలు చేస్తున్న కార్యక్రమాల ప్రయోజనాలు పొందాలని ప్రజలను కోరుతున్నారని మంత్రి అన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి అందించడానికి ప్రభుత్వం చర్యలు అమలు చేస్తుందన్నారు.

పీఎం ఉజ్వల యోజన వల్ల మహిళలకు సాధికారత, గౌరవం లభించాయని శ్రీ జితేంద్ర సింగ్ అన్నారు. దీనివల్ల మహిళల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడాయని అన్నారు. వంట చేస్తున్నప్పుడు విలువడే విషవాయువుల నుంచి మహిళలకు రక్షణ లభించిందన్నారు. స్వచ్ఛ భారత్ గ్రామీణ ప్రాంతాల ముఖం చిత్రాన్ని పూర్తిగా మార్చివేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావడంతో మహిళలు, ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయాల్సిన అవసరం లేకుండా పోయిందని మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన ప్రజలు అభివృద్ధి సాధించాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వం కారా?యక్రమాలు రూపొందించి అమలు చేస్తోందని మంత్రి వివరించారు. అధికారం చేపట్టిన రోజు నుంచి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశ శ్రేయస్సు, అభివృద్ధి కోసం అంకితం అయ్యారని శ్రీ జితేంద్ర సింగ్ తెలిపారు. ఓట్ బ్యాంకు రాజకీయాలకు పాల్పడకుండా కేవలం దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని శ్రీ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు.

# ఏపీలో షర్మిల పర్యటన..20న ఇడుపలపాయకు పయనం..

అమరావతి, జనవరి 19:ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తొలిసారి ఏపీలో పర్యటించబోతున్నారు. రెండు రోజుల పాటు ఏపీలో ఆమె పర్యటించనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో పర్యటన కొనసాగనుంది. ఈ నెల 20న మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఇడుపులపాయకు చేరుకుని.. సాయంత్రం వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. 21వ తేదీ ఉదయం కడప నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఉదయం 11 గంటలకు విజయవాడలో పీసీసీ చీఫ్?గా బాధ్యతలను స్వీకరిస్తారు.




# ఆలూ లేదు సూలూ లేదు అల్లుడి పేరు రామలింగం...

## -ఎలక్షన్ నోటిఫికేషన్ రాకముందే తనిఖీల పేరుతో డబ్బు సీజ్..
## - ప్రజలు, నేతల ఆగ్రహం.. ఏపీలో ప్రస్తుత పరిస్థితి

అమరావతి జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆలూ లేదు సూలూ లేదు అల్లుడి పేరు రామలింగం అన్నట్లుగా ఏపీలో ప్రస్తుత పరిస్థితి తయారైంది. కోడి కొనకముందే



మసాలాలు నూరుతున్నారు. అవును ఏపీలో ప్రస్తుతం ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఎన్నికల హోడావిడి కనిపిస్తోంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలతోపాటు పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల పేరుతో పోలీసులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఆ క్రమంలో వారు సొంత పనుల నిమిత్తం తీసుకెళ్తున్న నగదు లేదా డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారని వాపోతున్నారు.అయితే ఈ అంశంపై ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి వైసీపీ ప్రభుత్వ తీరుపై మండి పడ్డారు. జగన్ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ప్రజలను తనిఖీలు చేసే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఎన్నికలతో సంబంధం లేని డబ్బు, బంగారాన్ని అధికారులు ఎలా స్వాధీనం చేసుకుంటారని అన్నారు. ఇటీవల నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె పెళ్లికి బంగారం కొనేందుకు తెచ్చుకున్న డబ్బును కూడా పోలీసులు తనిఖీల్లో సీజ్ చేశారని వరదరాజుల రెడ్డి అన్నారు. దీంతోపాటు కొంత మంది వ్యాపారుల డబ్బును కూడా పట్టుకుంటున్నారని వెల్లడించారు. ఇలా ప్రతి రోజు తనిఖీలు చేసి సామాన్యులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. అలాంటి క్రమంలో ప్రజలు స్వాధీనం చేసుకున్న డబ్బు లేదా బంగారాన్ని తిరిగి ఎప్పుడిస్తారని భయాందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ఇలాంటి తనిఖీలను ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి. ఏపీలో గతంలో మార్చి 19, 2019న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఈ నేపథ్యంలో మార్చి 2024 మూడో వారంలో రాష్ట్రంలో ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

# రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై అస్సాంలో కేసు నమోదు

అస్సాం జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ చేపడుతున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై అస్సాం లో కేసు నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి యాత్ర రూట్స్ లో మార్పులు చేయడంతో పోలీసులు.. యాత్ర నిర్వాహకుడు కేబీ బైజు పై కేసు నమోదు చేశారు.ప్రస్తుతం రాహుల్ యాత్ర అస్సాంలోని జోర్హాట్ పట్టణంలో కొనసాగుతోంది. అయితే తాము ముందుగా నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే మార్గంలోకి యాత్రను మళ్లించినట్లు అస్సాం పోలీసులు తెలిపారు. చార్ట్‌లో చూపించని మార్గాన్ని ఎంచుకున్నారని పేర్కొన్నారు. రూట్‌ను అకస్మాత్తుగా మార్చడం అంతరాయాలకు దారితీసినట్లు తెలిపారు. యాత్ర నిర్వాహకులు, సహ నిర్వాహకులు ట్రాఫిక్ బారికేడ్‌లను బద్దలు కొట్టేలా అక్కడి సమూహాన్ని ప్రేరేపించారని ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసు అధికారిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు.కాగా, 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'పై కేసు నమోదు చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. యాత్రకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కాంగ్రెస్‌కు చెందిన అస్సాం ప్రతిపక్ష నేత దేబబ్రత సైకియా మండిపడ్డారు. ట్రాఫిక్ మళ్లింపు దగ్గర పోలీసులెవరూ లేరని చెప్పారు. యాత్ర కోసం తమకు కేటాయించిన మార్గం చాలా ఇరుకుగా ఉందని, జనాలు పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో కొన్ని మీటర్ల పాటు పక్కనున్న దారి గుండా ప్రయాణించాల్సి వచ్చిందని వివరించారు. రాహుల్ న్యాయ్ యాత్ర విజయవంతమవుతోందన్న భయంతోనే.. సీఎం హిమంత శర్మ తమ యాత్రకు ఆటంకం కలిగించాలనుకుంటున్నారని ఆరోపించారు.

# అలవికాని హామీలు ఇవ్వడమే కాంగ్రెస్ నైజం
## - ప్రజలలో ఎండగట్టాలని కెటిఆర్ పిలుపు




హైదరాబాద్, జనవరి 19:పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9 నాడు రుణమాఫీ చేస్తా, 2 లక్షల రుణం తెచ్చుకోండి అన్నారని గుర్తు చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తెలంగాణ భవన్ లో నేడు జరిగిన మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఇప్పుడేమో ఆయన కేబినెట్ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రుణాలు వసూలు చేయాలని ఆదేశాలు జారి చేశారని అన్నారు.

లేకుంటే కేసులు పెట్టండి అని అంటున్నారని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అది సాధ్యం కాదని మొన్న స్పష్టమైందన్నారు. నోటికి ఎంత వస్తె అంత అనుకుంటూ హామీలు ఇచ్చారని మండిపడ్డారు. అందుకే 420 హామీలను చేసేదాకా విడిచి పెట్టబోమని కేటీఆర్ అన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడిన కాంగ్రెస్, బీజేపీ నాయకుల అసలు రంగు బయట పడుతుందన్నారు.

ఇంకా కెటిఆర్ ఏమన్నారంటే..

"గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ గుళ్ళ అయ్యిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విఫలం అయ్యిందని అబద్ధాలు మాట్లాడించారు.

అందుకే స్వేద పత్రం విడుదల చేశాం. తెలంగాణ సమగ్ర అభివృద్ధిని పొందుపరిచాం. గణాంకాలు, ఆధారాలతో సహా వివరించాం.

ప్రియాంక గాంధీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెబితే, భట్టి గారు భృతి ఇస్తామని చెప్పలేదని హరీష్ రావు గారు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీ సాక్షిగా అబద్దం చెప్పారు. ప్రధాని, అదానీ ఒక్కటని విమర్శలు చేసిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నేడు ఆయనతోనే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాహుల్ గాంధీ నిన్ననే అదానీని తిడితే, రేవంత్ రెడ్డి అదే సమయంలో దావోస్ లో ఒప్పందం చేసుకున్నారు. కేసీఆర్ ఉన్నంత కాలం అదానీ ఇక్కడ అడుగు పెట్టలేదు. కానీ కాంగ్రెస్ రాగానే ఎలా అడుగు పెడుతున్నారు.

కేసీఆర్ , హరీశ్ రావు ల నాయకత్వంలో క్రియాశీలకంగా పని చేయడంతో గత ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించాం . ఈసారి కూడా మెదక్ లో గులాబీ జెండా ఎగరబోతున్నది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గత పదేళ్ళలో తెలంగాణ తరుపున గళం విప్పింది మన బీఆర్ఎస్ ఎంపీలు అనే విషయం మరచి పోవద్దు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమే. మన బలం, మన గళం, మన గులాబీ జెండా పార్లమెంట్ లో ఉండాలి. లేకుంటే తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని, ఇదే విషయం ప్రజలకు చెప్పాలి. నిరాశ వీడాలి. బయటికి రావాలి అంటూ పిలుపు ఇచ్చారు..

ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు హైదరాబాద్‌లో కూడా వేల కోట్ల రూపాయల ఆస్తులు సృష్టించి బంగారు తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పగించినా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాలను ఎదుర్కోవాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. ఇక నుంచి కార్యకర్తల అభిప్రాయం మేరకే పార్టీ కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ గెలవడం కష్టం కాదని" కేటీఆర్ అన్నారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు, సునీతా లక్ష్మా రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూధనాచారి, మెదక్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజక వర్గాల ఇన్‌చార్జీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# ఉమ్మడి సాగు నీటి ప్రాజెక్టులు కేంద్రం చేతిలోకి వెళ్తే తెలంగాణకు తీవ్ర నష్టం
## -మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణకు ప్రాణప్రదమైనవి నీళ్లు.. రాజకీయాలు మాట్లాడాల్సిన టైమ్‌లో మాట్లాడుతాం. రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారబోతున్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కలిసి మాట్లాడారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు మాట్లాడుకుందాం. ఆ తర్వాత అభివృద్ధిపై చర్చించాలన్నారు. ఉమ్మడి సాగు నీటి ప్రాజెక్టులు కేంద్రం చేతిలోకి వెళ్తాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వారం రోజుల్లోగా వెళ్తాయని నిన్న ఢిల్లీ లో జరిగిన ఉన్నత స్థాయి మీటింగ్‌లో నిర్ణయమైనట్టుగా తెలుస్తున్నది. ఇదే జరిగితే ఏపీకి లాభం, తెలంగాణకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.జూలై 2021 లోనే కేంద్రం కేఆర్ఎంబీ పరిధిలోకి ఉమ్మడి ప్రాజెక్టులను తేవాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను కేసీఆర్ నాడు గట్టిగా వ్యతిరేకించారు. మేము ఆనాడు కొన్ని షరతులు పెట్టాం. వాటిని ఇంకా కేంద్రం ఒప్పుకోలేదని గుర్తు చేశారు. కృష్ణా జలాల్లో ఇంకా తెలంగాణ వాటా తేలనప్పుడు కేఆర్ఎంబీ పరిధిలోకి ఉమ్మడి ప్రాజెక్టులను ఎలా తెస్తారని ప్రశ్నించారు.

మాన్యువల్ లేకుండానే అలా ఎలా చేస్తారు..

కృష్ణా నీటిని ఏపీకి 50 శాతం తెలంగాణకు 50 శాతం పంపిణీ చేయాలని కూడా షరతు పెట్టాం. శ్రీశైలం నుంచి జల విద్యుత్ ఉత్పత్తి చేసి 264 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేయాలని మరో షరతు పెట్టాం. ఏక పక్షంగా కేఆర్ఎంబీపై నిర్ణయం తీసుకోకుండా అపెక్స్ కమిటీ వేయాలని మేము ఆనాడే కోరామన్నారు. ఆపరేషన్ మాన్యువల్ రూపొందించకుండా కేఆర్ఎంబీ పరిధిలోకి ఎలా తెస్తారని సూటిగా ప్రశ్నించారు.ప్రస్తుత ప్రభుత్వం గుడ్డిగా కేఆర్ఎంబీ ఏర్పాటుకు ఒప్పుకున్నదని వార్తలు వస్తున్నాయని చెప్పారు. పాలమూరు -రంగారెడ్డి కి జాతీయ హోదా కేంద్రం ఇవ్వమంటే ఒప్పుకున్నట్టే..కేఆర్ఎంబీకి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టు అనిపిస్తుందన్నారు. కేఆర్ఎంబీ పరిధిలోకి ఉమ్మడి ప్రాజెక్టులను తెస్తే జల విద్యుత్ ఉత్పత్తి పై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణకు ఆత్మహత్యా సదృశ్యమే..

నాగార్జున సాగర్ ఎడమ గట్టు కాలువ ఆయకట్టు పై కూడా కేఆర్ఎంబీ ఎఫెక్ట్ ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తాగు నీళ్లకు కూడా కటకట ఏర్పడుతుందని చెప్పారు. కేఆర్ఎంబీలో ఉమ్మడి ప్రాజెక్టులు చేరిస్తే తెలంగాణకు ఆత్మహత్యా సదృశ్యమేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని సూచించారు. రాజకీయం మాని రాష్ట్రానికి జరిగే నష్టం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం స్పందించకుంటే బీఆర్ఎస్ పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఎప్పటికైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది గులాబీ జెండానేనని పేర్కొన్నారు. మేడి గడ్డ బ్యారేజ్‌కి నష్టం కలిగినా నీటిని ఎత్తిపోయడంలో ఇబ్బంది లేదన్నారు. ఇప్పటికీ అక్కడ 4 నుంచి 5 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయని తెలిపారు.

ఎంతకైనా తెగిస్తాం..

కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు కూడా వెంటనే నీటిని విడుదల చేయాలన్నారు. కాళేశ్వరం పంపులను సాంకేతికంగా 24 గంటలు నడపాలి. ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో మోటార్లు నడప కూడదన్నారు. మా మీద బురద జల్లడం కాదు..కాళేశ్వరం పై రోజుకో లీకు ఫేక్ వార్తను ప్రభుత్వం సృష్టిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం, వాటి కోసం బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమర్ధవంతమైన, దార్శనిక నాయకత్వంలో
## ఆలోచనా ధోరణి మారుతోంది - దేశం మారుతోంది - శ్రీ పాటిల

న్యూఢిల్లీ, జనవరి 19:కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో 'ఆరోగ్యవంతమైన రేపటి దిశగా ఆరోగ్యవంతమైన గ్రామం ' అనే అంశంపై మూడు రోజుల జాతీయ వర్క్ షాప్ ను ఈ రోజు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ బూడి ముత్యాలనాయుడు, కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ భరద్వాజ్ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ తన ప్రధానోపన్యాసంలో, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పునర్నిర్మాణం తో పాటు దృఢంగా ముందుకు సాగుతోందని అన్నారు. అందరికీ ఆరోగ్యం శ్రేయస్సును నిర్ధారించడంలో ప్రభుత్వ వనరులు , చొరవలకు అదనంగా గ్రామ పంచాయితీ స్థాయిలో సహకార ప్రయత్నాల పరివర్తన శక్తి, దృఢ సంకల్పం గురించి శ్రీ పాటిల్ వివరించారు. క్షేత్రస్థాయి సహకార ఆవశ్యకత గురించి చెబుతూ, స్థానిక సాధికారత, కమ్యూనిటీ భాగస్వామ్యం కోసం ఎల్ ఎస్ డి జి ల కింద నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాలపై దృష్టి సారించాలని కోరారు.

సమగ్ర, సుస్థిర అభివృద్ధి కోసం ప్రతి గ్రామపంచాయతీ వ్యూహాత్మకంగా అన్ని ఎల్ ఎస్ డీజీలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని శ్రీ పాటిల్ నొక్కి చెప్పారు. సమర్థవంతమైన, దూరదృష్టి గల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజల ఆలోచన ధోరణి లోనూ, దేశం లోనూ వస్తున్న మార్పు ను ఆయన వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధికి ఉత్ప్రేరకాలుగా చైతన్యవంతమైన గ్రామాలను ఊహించి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ గుర్తించిన తొమ్మిది స్థానికీకరించిన సుస్థిర లక్ష్యాలకు కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. వికసిత భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా అన్ని పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను దేశవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ చేరవేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు.

శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ కర్బన తటస్థత వైపు ప్రపంచవ్యాప్త మార్పును ప్రశంసించారు. భారతదేశ గణనీయమైన పురోగతికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వానిదే ఘనత అని అన్నారు. జమ్ముకశ్మీర్ లోని సాంబా జిల్లా పరిధిలోని పల్లి గ్రామపంచాయతీలో పునరుత్పాదక ఇంధనం, కార్బన్ న్యూట్రల్ మొదటి చొరవ గురించి ప్రస్తావిస్తూ, ఈ దిశగా అన్ని పంచాయతీ రాజ్ సంస్థలు పనిచేయాలని శ్రీ పాటిల్ పేర్కొన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, మెరుగైన రేపటి కోసం పల్లె గ్రామపంచాయతీ నమూనాను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, శ్రీ బూడి ముత్యాల నాయుడు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను ఉపయోగించి కన్వర్జెన్స్ ద్వారా వెల్నెస్ సెంటర్లను నిర్మిస్తున్నామని చెప్పారు. కేంద్ర పంచాయితీరాజ్ శాఖ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ ,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ,పంచాయితీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ బూడి ముత్యాల నాయుడు గ్రామ పంచాయితీ సర్పంచిగా తమ ప్రయాణాన్ని ప్రారంభించారని, ఇప్పుడు ఉన్నత పదవులు నిర్వహిస్తున్నారని తెలుసుకొని పాల్గొనేవారు ప్రేరణ పొందారు. సర్పంచ్ పదవి నుంచి ఉన్నత పదవుల వరకు సాగిన వీరి ప్రయాణం పంచాయతీ ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

జాతీయ వర్క్ షాప్ కార్యదర్శి శ్రీ వివేక్ భరద్వాజ్ ప్రసంగిస్తూ, లభ్యత, అందుబాటు, తక్కువ ఖర్చు, తగిన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా అన్ని వయసుల వారి ఆరోగ్యం శ్రేయస్సు కోసం ఎల్ ఎస్ డి జి ల రెండవ థీమ్ ను సంస్థాగతం చేయడానికి ప్రజల ఆధారిత విధాన రూపకల్పన , సమర్థవంతమైన అమలు అవసరాన్ని వివరించారు.

మూడు ప్రధాన ప్రాధాన్యతలను గుర్తించడానికి గ్రామ పంచాయితీల పాత్రను ఆయన నొక్కిచెప్పారు: మొదటిది, అవగాహన కల్పించడం; రెండవది, ఆరోగ్య సేవలను సులభంగా పొందడానికి కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంచడం; మూడవది, పంచాయితీలు , ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం, బాల సభ, మహిళా సభ, రోగి కళ్యాణ్ సమితి (రోగుల సంక్షేమ కమిటీ), స్వాస్థ్య సమితి (ఆరోగ్య కమిటీ) మొదలైన అన్ని ఫోరమ్ లు, కమిటీలు సమర్ధవంతంగా పనిచేసేలా చూడటం. శ్రీ భరద్వాజ్ కోవిడ్-19 మహమ్మారి సమయంలో భారతదేశ స్థితిస్థాపకతను గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. దేశం తన స్వంత వ్యాక్సిన్ ను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, ఇది దేశంలో ఆవిష్కరణ, సంకల్పాల శక్తి , సానుకూల ప్రభావానికి నిదర్శనం అని అన్నారు.

సుమారు 13,000 గ్రామ పంచాయితీలు ఆరోగ్యవంతమైన గ్రామం హోదాను సాధించాలని తీర్మానించాయని, ఆరోగ్యకరమైన గ్రామం అనే ఎల్ ఎస్ డిజి థీమ్ లక్ష్యాన్ని సాధించడానికి సంకల్పం తీసుకునేలా ఈ గ్రామ పంచాయితీలు ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తాయని కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేశారు. వాటాదారులందరికీ తమ పరస్పర ఆలోచనలు, అభిప్రాయాలు , ఉత్తమ పద్ధతులను పంచుకునే అవకాశాన్ని జాతీయ వర్క్ షాప్ కల్పిస్తుందని శ్రీ భరద్వాజ్ చెప్పారు.

జాతీయ వర్క్ షాప్ లో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్, ఎంఓపీఆర్ జాయింట్ సెక్రటరీ శ్రీ వికాస్ ఆనంద్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్ డి అండ్ పిఆర్ విభాగం కమిషనర్ శ్రీమతి ఎ సూర్య కుమారి, ఇతర ప్రముఖులు, పంచాయతీ ప్రతినిధులు పాల్గొంటున్నారు.

జాతీయ వర్క్ షాప్ నుద్దేశించి అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్ర శేఖర్ కుమార్ ప్రసంగిస్తూ, టిబి-ముక్త్ పంచాయితీ చొరవ నహా ఆరోగ్యకరమైన గ్రామం కోసం పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ, సంబంధిత మంత్రిత్వ శాఖలు / డిపార్ట్ మెంట్ లు , రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తీసుకున్న అనేక కార్యక్రమాలను ప్రస్తావించారు. డాక్టర్ సి.ఎస్.కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న వికసిత భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలకు కోట్లాది సంఖ్యలో సందర్శకులు వచ్చారని, ఇది చివరి మైలు వరకు ఆరోగ్య సేవలను అందించడం లో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో హెల్దీ విలేజ్ కార్యక్రమాల కింద చేపట్టిన కార్యక్రమాలు ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన భారతదేశానికి దోహదం చేస్తున్నాయని, పంచాయితీలు వేగంగా ఆరోగ్యవంతమైన గ్రామాలుగా రూపాంతరం చెందుతున్నాయని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత భారత్ సంకల్ప్ యాత్రకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశేష స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాలు, అర్హులైన లబ్ధిదారులందరికీ ఆయుష్మాన్/ ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేయడం, 1000 గ్రామాల్లో పూర్తయిన స్వమిత్వ పథకం అమలు, కిచెన్ గార్డెన్ల ద్వారా పౌష్టికాహార ఆధారిత ప్రయోజనాలను అందించడం, అల్పాదాయ వర్గాల పౌష్టికాహార ప్రమాణాలకు విస్తరించడం తదితర కార్యక్రమాల్లో సుమారు 14 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించారు.

ఈ జాతీయ వర్క్ షాప్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు, ఎన్ ఆర్ డి అండ్ పి ఆర్, ఎస్ఐఆర్ డీ అండ్ పీఆర్, పంచాయతీరాజ్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్స్, ఐక్యరాజ్యసమితి/ జాతీయ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాదాపు 800 మంది పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారు. అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, స్థానిక చర్యలను ప్రోత్సహించడం, వనరులను సమీకరించడం, ఆరోగ్యకరమైన గ్రామీణ సమాజాలను పెంపొందించడానికి ఉద్దేశించిన వ్యూహాలు, కార్యక్రమాలపై చర్చించడానికి విధాన రూపకర్తలు, ప్రభుత్వ అధికారులు, నిపుణులు, పంచాయతీ ప్రతినిధులు , భాగస్వాములను ఏకతాటిపైకి తీసుకురావడానికి తిరుపతిలోని జాతీయ వర్క్ షాప్ తగిన , శక్తివంతమైన వేదికగా ఆవిర్భవించింది.

జాతీయ వర్క్ షాప్ లో పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, కిందిస్థాయి అధికారులు పాల్గొంటున్నారు. థీమ్ 2 కింద హెల్దీ విలేజ్ పై ప్రతిష్ఠాత్మక జాతీయ పంచాయతీ అవార్డులు అందుకున్న పంచాయతీలు ఆరోగ్యవంతమైన గ్రామాలను సృష్టించే లక్ష్యాన్ని సాధించడంపై దృష్టి సారించిన మూడు రోజుల జాతీయ వర్క్ షాప్ లో చిన్న వీడియో ఫిల్మ్ ప్రజెంటేషన్ ద్వారా తమ ఉత్తమ పద్ధతులు , అంతర్లీన అనుభవాలను పంచుకోనున్నాయి. ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలు, ఝూప్ గో, నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్ హెచ్ ఎ), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎన్ఐహెచ్ఎఫ్ డబ్ల్యూ), నిమ్హాన్స్ , ట్రాన్స్ ఫార్మ్ రూరల్ ఇండియా ఫౌండేషన్ (టీఆర్ఐఎఫ్) వంటి జాతీయ ప్రభుత్వేతర సంస్థల (ఎన్జీవో) ప్రతినిధులు కూడా ఈ జాతీయ వర్క్ షాప్ లో పాల్గొంటున్నారు.

# మహిళ హత్య కేసును ఛేదించిన వికారాబాద్ పోలీసులు




హైదరాబాద్, జనవరి 19: గత మూడు రోజుల క్రితం పులుమద్ది గ్రామ సమీపంలో జరిగిన మహిళ హత్య కేసును చెందిన పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కోటిరెడ్డి వికారాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి మహిళ హత్యకు గల కారణాలను వివరించారు.

చేవెళ్ల గ్రామానికి చెందిన అనసూయ (35) అనే మహిళకు ధారూరు మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన తలారి బాబుకు గత మూడు నాలుగు సంవత్సరాలుగా అక్రమ సంబంధం కొనసాగుతుంది. బాబు పటాన్ చెరువులో వాటర్ ట్యాం కర్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తు న్నాడు. అయితే అనసూయకు పలు సందర్భాల్లో డబ్బులు ఇవ్వడం, ఆ డబ్బులు తిరిగి అడుగడంతో ఇరువురి మధ్య మనస్పర్థాలు ఏర్పడి దూరంగా ఉంటూ వస్తున్నారు. అనసూ య వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమాన ంతో తలారీ బాబు అనసూయను హత్య చేయాలని నిర్ణయించి ఈ నెల 14న వికారాబాద్ పులుమద్ది ప్రాంతానికి తీసుకొచ్చి మధ్యం తాగించి ఆపై హత్య చేసి నిప్పంటించాడు. మృతురాలి ఒంటిపై బంగారం, వెండి తీసుకెళ్లి కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లుగా పోలీసులు తెలిపారు. 15వ తేదీన సర్పంచ్ మాదవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని టీమ్ లు ఏర్పాటు చేసి 48 గంటలలో కేసును ఛేధించడం జరిగిందన్నారు. కేసును త్వరగా గుర్తించిన క్లోస్ చేసిన పోలీసులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవీందర్, డీఎస్పీ నర్సిములు, సీఐలు శ్రీను, ఆంజనేయులు, ఎస్ఐలు సంతోష్, అనిత, భరత్ భూషణ్ లు పాల్గొన్నారు.

# పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం సహ రుణాలు ఇవ్వడం కోసం చేతులు కలిపిన ఐఆర్ఇడిఎ & ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకు

న్యూఢిల్లీ, జనవరి 19:దేశ వ్యాప్తంగా భిన్నమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సహ రుణాలు, రుణాల సిండికేషన్ కోసం సహకార యత్నాలకు వేదికను ఏర్పరచేందుకు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు (ఐఒబి)తో భారత పునరుత్పాదక ఇంధన అభివృద్ధి ఏజెన్సీ లిమిటెడ్ (ఐఆర్ఇడిఎ) అవగాహనా ఒప్పందంపై సంతకం చేసింది. వివిధ రకాల సేవలను ఆవరిస్తూ, ఈ ఎంఒయులో అన్ని పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సహ రుణాలు, సహ ఆరంభోత్పత్తి మద్దతుకు నియమాలు ఉన్నాయి. ఐఆర్ఇడిఎ రుణ గ్రహీతల కోసం రుణ సిండికేషన్, పూచీకత్తు ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, ట్రస్ట్ అండ్ రిటెన్షన్ అకౌంట్ (టిఆర్ఎ) నిర్వహణతో పాటుగా, ఐఆర్ఇడిఎ రుణాల కోసం 3-4 సంవత్సరాల వ్యవధిలో స్థిరవడ్డీ రేట్ల దిశగా పనిచేయడం ఈ భాగస్వామ్యం లక్ష్యం.

ఈ ఒప్పందాన్ని 16 జనవరి 2024న న్యూఢిల్లీలోని ఐఆర్ఇడిఎ బిజినెస్ సెంటర్‌లో చేసుకున్నారు. ఎంఒయుపై ఐఆర్?డిఎ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రదీప్ కుమార్ దాస్, ఐఒబి ఎండిఉ సిఇఒ శ్రీ అజయ్ కుమార్ శ్రీవాస్తవ; ఐఆర్ఇడిఎ డైరెక్టర్ (ఫైనాన్స్) డాక్టర్ బిజయ్ కుమార్ మొహంతి సమక్షంలో ఐఆర్ఇడిఎ జనరల్ మేనేజర్ డాక్టర్ ఆర్.సి. శర్మ, ఐఒబి చీఫ్ రీజినల్ మేనేజర్ శ్రీ అనిల్‌కుమార్‌లు సంతకాలు చేశారు.

ఈ అవగాహనా ఒప్పందం గురించి ఐఆర్ ఇడిఎ సిఎండి శ్రీ ప్రదీప్ కుమార్ దాస్ మాట్లాడుతూ, ఐఆర్ఇడిఎ ఉ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అన్నది దేశంలో పునరుత్పాదక ఇంధన వృద్ధిని వేగవంతం చేయాలన్న మా నిబద్ధతలో ఒక ముఖ్యమైన అడుగు. మా బలాలను, వనరులను కలపడం ద్వారా, వివిధ రకాల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు బలమైన ఆర్థిక మద్దతును అందించాలని, స్థిరత్వాన్ని, పర్యావరణం పట్ల అవగాహనను పెంచి పోషించాలన్నది మా లక్ష్యం. ఈ ఎంఒయు, ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థలతో ఇంతకు ముందు చేసుకున్న ఒప్పందాల ద్వారా, ఐఆర్ఇడిఎ అన్నది భారీ స్థాయి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు నిధులను అందించే మంచి స్థితిలో ఉంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలా జేతర ఆధారిత విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని సాధిస్తామన్న గౌరవ ప్రధాని సిఒపి 26లో చేసిన ప్రకటనకు సమలేఖనంగా ఉంది. ఈ సహకారం అన్నది బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో సహా ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థలతో ఐఆర్ఇడిఎ విజయవంతమైన భాగస్వామ్యాన్ని నిర్మించింది. ఈ ఎంఒయులు కూడా దేశవ్యాప్తంగా వివిధ రకాల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సహ రుణాలు, రుణ సిండికేషన్‌పై దృష్టి సారిస్తాయి.



# న్యూఢిల్లీలో 3 రోజుల స్మార్ట్ సిటీస్ ఇండియా ఎక్స్ పో

న్యూఢిల్లీ, జనవరి 19:కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎం ఒ హెచ్ యు ఎ) కు చెందిన స్మార్ట్ సిటీస్ మిషన్ (ఎస్ సి ఎం) 'నేషనల్ స్మార్ట్ సిటీస్ మిషన్ పెవిలియన్'లో మిషన్ సాధించిన విజయాలను ప్రదర్శిస్తోంది. ఇండోర్ స్మార్ట్ సిటీ చప్పన్ దుకాన్, కనెక్టింగ్ పాస్ట్ విత్ ఫ్యూచర్ ఆఫ్ సూరత్ స్మార్ట్ సిటీ, ఏరియా బేస్డ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉదయ్ పూర్ స్మార్ట్ సిటీ, ప్రయాగ్ రాజ్ స్మార్ట్ సిటీ మాన్యుస్క్రిప్ట్ డిజిటలైజేషన్ వంటి అత్యంత ప్రభావవంతమైన ప్రాజెక్టుల నమూనాలను నేషనల్ పెవిలియన్ లో ప్రదర్శిస్తున్నారు.

నివాసయోగ్యమైన, సుస్థిరమైన నగరాల నిర్మాణానికి అనువైన పరిష్కారాలను గుర్తించే నగర కార్యక్రమాల గురించి చర్చించడానికి నగర నాయకులను , ప్రైవేట్ పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకు వచ్చేందుకు 2024 జనవరి 19 న సిటీ లీడర్స్ కాన్ క్లేవ్ ను నిర్వహిస్తారు. 100 స్మార్ట్ సిటీలలో ఉత్తమ విధానాలను గౌరవించడం ద్వారా మన నగరాలను నివాసయోగ్యంగా, సుస్థిరంగా, ఆర్థికంగా లాభదాయకంగా మార్చడం ద్వారా ప్రభావాన్ని చూపిన ప్రాజెక్టులను గుర్తిస్తూ 2024 జనవరి 19 న స్మార్ట్ సిటీస్ ఇండియా అవార్డులు ప్రదానం చేస్తారు.

9వ స్మార్ట్ సిటీస్ ఇండియా ఎక్స్ పో 2024 జనవరి 17 నుండి 19 వరకు న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్ లో జరుగుతోంది. ఇండియా ట్రేడ్ ప్రమోషన్స్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ), ఎగ్జిబిషన్స్ ఇండియా గ్రూప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల ఎక్స్ పోలో స్మార్ట్ ఐసీటీ, స్మార్ట్ ఎనర్జీ, బిల్డింగ్స్, ట్రాన్స్ పోర్ట్, వాటర్, క్లీన్ ఇండియా వంటి స్మార్ట్ సిటీ ఫ్రేమ్ వర్క్ లోని కీలక విభాగాలు ఉన్నాయి. స్మార్ట్ సిటీలను సాకారం చేసే దిశగా లోతైన కమ్యూనికేషన్కు, ఆచరణాత్మక విధానానికి ఇవి ఒక వేదికను అందిస్తాయి.

స్మార్ట్ సిటీస్ మిషన్ అవలోకనం:

'స్మార్ట్ సొల్యూషన్స్' అనువర్తనం ద్వారా ప్రధాన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన, సుస్థిరమైన పర్యావరణాన్ని అందించే నగరాలను ప్రోత్సహించడం , తమ పౌరులకు మెరుగైన జీవనాన్ని అందించే లక్ష్యంతో 2015 జూన్ 25 న గౌరవ ప్రధాన మంత్రి స్మార్ట్ సిటీస్ మిషన్ ను ప్రారంభించారు.

మిషన్ లో భాగంగా మొత్తం 100 స్మార్ట్ సిటీలు స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలు కోసం స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్ పి వి)లను ఏర్పాటు చేశాయి. ఈ 100 ఎస్ పి వి లు రూ. 1.7 లక్షల కోట్లకు పైగా విలువైన 8,000 మల్టీ సెక్టోరల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాయి. 2024 జనవరి 15 నాటికి 100 ఎస్ పి వి లు రూ. 1.32 లక్షల కోట్లకు పైగా విలువైన 6,650+ ప్రాజెక్టులను పూర్తి చేశాయి.

స్మార్ట్ సిటీస్ మిషన్ గుర్తించదగిన విజయాలు:

1.మొత్తం 100 స్మార్ట్ సిటీలలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) ఉంది, ఇవి డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి డేటాను ఉపయోగిస్తున్నాయి. పట్టణ నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరిగింది. నేరాల ట్రాకింగ్, పౌరుల భద్రత, రక్షణ , రవాణా నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, నీటి సరఫరా, విపత్తు నిర్వహణ వంటి వివిధ రంగాలలో 100 నగరాల్లోని ప్రతి నగరంలో పట్టణ సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయి.

2.సిటిజన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ: ప్రజా భద్రతను పెంపొందించడానికి సీసీ కెమెరాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజమ్స్ సహా మెరుగైన రోడ్డు భద్రత కోసం నిఘా వ్యవస్థలను కలిగి ఉన్న ఐటీఎంఎస్ (ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్స్) లను ఏకీకృతం చేశారు. 100 స్మార్ట్ సిటీల్లో 76 వేలకు పైగా సీసీ కెమెరాలు నేరాల పర్యవేక్షణకు దోహదపడుతున్నాయి. 1,884 ఎమర్జెన్సీ కాల్ బాక్స్ లు, 3,000+ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, రెడ్ లైట్ ఉల్లంఘనలకు ట్రాఫిక్ ఎన్ ఫోర్స్ మెంట్ సిస్టమ్స్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ వంటి వాటిని కూడా ఏర్పాటు చేశారు.

3.అర్బన్ మొబిలిటీని పెంచే దిశగా స్మార్ట్ సిటీలు 1,300 స్మార్ట్ మొబిలిటీ ప్రాజెక్టులను పూర్తి చేయగా, 383 ప్రాజెక్టులు పూర్తి కావస్తున్నాయి. స్మార్ట్ మొబిలిటీ ప్రాజెక్టుల అభివృద్ధిలో మొత్తం పెట్టుబడి రూ .40,000 కోట్లకు పైగా ఉంటుంది. యూనివర్సల్ యాక్సెసబిలిటీ, యుటిలిటీ డక్ట్స్ , సరైన సైనేజీలతో 2,500+ కిలోమీటర్ల స్మార్ట్ రోడ్లు. 7,500+ కొత్త బస్సులు (2000+ ఎలక్ట్రిక్ బస్సులతో సహా), 5,000+ బస్ స్టాప్ లు అభివృద్ధి చేయబడ్డాయి/ పునరుద్ధరించబడ్డాయి. 600 కిలోమీటర్లకు పైగా సైకిల్ ట్రాక్ లను అభివృద్ధి చేశారు. ట్రాఫిక్ కార్యకలాపాలను మెరుగుపరచడం, ట్రాఫిక్ ఉల్లంఘనలను అమలు చేయడం, ప్రయాణ సమయాన్ని మెరుగు పరుస్తూ ఐ సి సి సి ల ద్వారా ఇంటెలిజెంట్ ట్రాన్స్ పోర్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఐటిఎంఎస్) ను అమలు చేశారు. పర్యవేక్షించారు.

4.పట్టణ సేవల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం:

600+ స్మార్ట్ ఎనర్జీ, 1,250+ వాటర్ అండ్ శానిటేషన్ ప్రాజెక్టులు వంటి స్మార్ట్ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల అమలు పూర్తయింది. 50 లక్షలకు పైగా సోలార్/ఎల్ ఇ డి వీధిలైట్లు ఏర్పాటు చేసి, 89,000 కిలోమీటర్లకు పైగా భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను నిర్మించారు. 700 టి పి డి పైగా వేస్ట్ టు ఎనర్జీ ప్రాసెసింగ్ కెపాసిటీని ఏర్పాటు చేశారు. సమర్థవంతమైన నీటి సరఫరా, పారిశుధ్యం మొదలైన వాటి కోసం స్కాడా వంటి సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అవలంబించారు. 50 కి పైగా నగరాలు సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ను పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నిర్వహిస్తున్నాయి, ఇది రూట్ మేనేజ్ మెంట్, సేకరణ సమర్థత , రోజువారీ నిర్వహణను మెరుగుపరిచింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ సామర్థ్యాన్ని డిజిటలైజ్ చేయడానికి, మెరుగుపరచడానికి ఆటోమేటిక్ వెహికల్ లొకేషన్ (ఎవిఎల్) కోసం సుమారు 5,000 వాహనాలకు ఆర్ ఎఫ్ ఐ డి ఎనేబుల్ చేశారు. స్కాడా ద్వారా 6,800 కిలోమీటర్లకు పైగా నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ రెవెన్యూయేతర నీరు, లీకేజీలను తగ్గిస్తున్నారు.

5.మన నగరాలను మరింత నివాసయోగ్యంగా సుస్థిరంగా మార్చడానికి, 700+ సామాజిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 6,855 స్మార్ట్ తరగతి గదులను అభివృద్ధి చేశారు. 40 డిజిటల్ లైబ్రరీ లను అభివృద్ధి చేశారు, 1,600+ అంగన్వాడీలను (నిరుపేద పిల్లల కోసం) అభివృద్ధి చేశారు. ఆరోగ్యం కోసం స్మార్ట్ సిటీలు 308 ఇ-హెల్త్ సెంటర్లను, క్లినిక్ లను (ప్రత్యేక పడకలు లేకుండా) అభివృద్ధి చేశారు. 255 ఆరోగ్య ఎటిఎంలను ఏర్పాటు చేశారు.

6.వైబ్రెంట్ పబ్లిక్ స్పేసెస్ అభివృద్ధి:

47 నగరాల్లో అభివృద్ధి చేసిన 180+ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టులు, సాంస్కృతిక వారసత్వంపై అభివృద్ధి చేసిన 170+ ప్రాజెక్టులు , 68 నగరాల్లో 200+ మార్కెట్ల పునరాభివృద్ధి సహా 100 స్మార్ట్ సిటీలలో పబ్లిక్ స్పేస్ పై 1377+ ప్రాజెక్టు లను అభివృద్ధి చేస్తున్నారు. విపత్తు ప్రతిస్పందన కోసం 155 పర్యావరణ సెన్సార్లను ఏర్పాటు చేసి, 5,300 మందికి పైగా సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు.

7.స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లు, మార్కెట్ రి డెవలప్ మెంట్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా పెట్టుబడులను ఆకర్షించే గ్రోత్ హబ్ లుగా స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేసే దిశగా 674 ఆర్థిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రూ. 13,800 కోట్లకు పైగా పెట్టుబడితో మరో 263 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. 37 ఇంక్యుబేషన్ సెంటర్లు/స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ల ను అభివృద్ధి చేశారు. 50కి పైగా మార్కెట్ పునరాభివృద్ధి ప్రాజెక్టులు పూర్తయ్యాయి.

8.సామర్థ్యాన్ని తీసుకురావడానికి ప్రైవేట్ రంగంతో సహకారం / భాగస్వామ్యాల అవసరాన్ని గుర్తించి 186 పిపిపి ప్రాజెక్టులు పూర్తి చేశారు. సుమారు 11,000 కోట్ల రూపాయల మొత్తం పెట్టుబడులతో మరో 20 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి.

## స్మార్ట్ సిటీస్ మిషన్ ఇతర ముఖ్య చొరవలు

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద రూపొందించిన అసెస్మెంట్ ఫ్రేమ్ వర్క్ లో ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్, మున్సిపల్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్, డేటా మెచ్యూరిటీ అసెస్మెంట్ ఫ్రేమ్వర్క్, క్లైమేట్ స్మార్ట్ సిటీస్ అసెస్మెంట్ ఫ్రేమ్వర్క్ ఉన్నాయి. ఈ బహుళ సూచికలు , ఫ్రేమ్ వర్క్ లు అర్బన్ అవుట్ కమ్స్ ఫ్రేమ్ వర్క్ లో విలీనం చేయబడ్డాయి, 14+ సెక్టార్లలో 250+ నగరాల్లో 100,000+ డేటా పాయింట్లను సృష్టించాయి. ×జాతీయ సవాళ్లు: స్మార్ట్ సిటీస్ మిషన్ నిరంతరం అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా తనను తాను మార్చుకుంది. నగరాలకు ఎలా ప్రతిస్పందించాలో ఎంపికను అందించింది. ఉదాహరణకు, కోవిడ్-19 మహమ్మారి చురుకైన ,ఆరోగ్యకరమైన జీవనశైలిని కలిగి ఉండటంలో బహిరంగ ప్రదేశాల ప్రాముఖ్యత గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచినప్పుడు, మిషన్ ఛాలెంజ్ ఫార్మాట్ లో ఇండియా 'సైకిల్స్ 4 చేంజ్' ,'స్ట్రీట్ 4 పీపుల్' వంటి ప్రచారాలను ప్రారంభించింది. అత్యంత నిస్సహాయులైన పౌరులు ముఖ్యంగా చిన్న పిల్లలు, సంరక్షకులకుకూడా బహిరంగ ప్రదేశాలకు ప్రాప్యతను నిర్ధారించడానికి నగరాలు 'ప్లేస్ మేకింగ్ మారథాన్లు' నైబర్ హుడ్ ఛాలెంజ్ పెంచడం' లో పాల్గొన్నాయి. 'ట్రాన్స్ పోర్ట్ ఫర్ ఆల్', ' ఈట్ స్మార్ట్ సిటీస్' వంటి ఇతర సవాళ్లు ప్రజా రవాణాలో స్టార్టప్ లను ప్రోత్సహించడం, స్మార్ట్ సిటీలలో ఆహార పరిశుభ్రతను మెరుగుపరచడం లో దోహదపడ్డాయి.

నేషనల్ అర్బన్ డిజిటల్ మిషన్: దేశంలోని అన్ని పట్టణాలు , నగరాల్లో ప్రాప్యత, సమ్మిళిత, సమర్థవంతమైన , పౌర కేంద్రీకృత పాలనను అందించే జాతీయ పట్టణ డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి ఫిబ్రవరి 2021 లో ఇది ప్రయోగాత్మకంగా ప్రారంభించబడింది. ఎన్ యు డి ఎం 2000+ యుఎల్ బిలను ఆన్ బోర్డ్ చేసింది. 2028 నాటికి అన్ని యుఎల్ బిలను ఆన్ బోర్డ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అర్బన్ లెర్నింగ్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ (తులిప్)- భారతదేశంలో పెద్ద సంఖ్య లో టెక్నికల్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు, వారికి వృత్తిపరమైన అభివృద్ధికి రియల్ వరల్డ్ ప్రాజెక్ట్ అమలు, ప్రణాళికపై అవగాహన అవసరం. 'యుఎల్ బిలు , స్మార్ట్ సిటీలు, వాటి సంక్లిష్టమైన, భారీ కార్యకలాపాలతో, యువ మేధస్సు లకు వాస్తవ ప్రపంచ అభ్యాసానికి ఆశాజనక వాతావరణాన్ని అందిస్తాయి. ఈ లక్ష్యంతోనే ఇటీవలి గ్రాడ్యుయేట్ల అభ్యసన అవసరాలతో యుఎల్ బిలు ,స్మార్ట్ సిటీలలో అవకాశాలను సరిపోల్చడానికి ఎంఓహెచ్ యుఎ , ఎంహెచ్ ఆర్ డి 'ది అర్బన్ లెర్నింగ్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ (తులిప్)'ను ప్రారంభించాయి. ఇటీవలి గ్రాడ్యుయేట్లకు ప్రత్యక్ష అభ్యసన అనుభవాన్ని అందించడం , క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించడానికి తాజా శక్తి, ఆలోచనలతో రాష్ట్రాలు, యు ఎల్ బి లు, స్మార్ట్ సిటీలకు ప్రయోజనం చేకూర్చడం అనే రెండు లక్ష్యాలను నెరవేర్చడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. 40,000 మందికి పైగా ఇంటర్న్ షిప్ లు పోస్ట్ చేశారు. ఇంకా 6,000 కు పైగా పూర్తి చేశారు.

# 22న సెలవు ప్రకటించండి- రాష్ట్ర ప్రభుత్వానికి బండి సంజయ్ వినతి..



కరీంనగర్, జనవరి 19:ఈనెల 22న అయోధ్యలో జరగబోయే రామ మందిర పున:ప్రతిష్ట కార్యక్రమం కోసం యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తున్న తరుణంలో ఆరోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా పవిత్రమైన దైవ కార్యాన్ని ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా చూడాలని కోరారు. ఈరోజు మధ్యాహ్నం హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంటకు విచ్చేసిన బండి సంజయ్ కుమార్ ప్రసిద్ధిగాంచిన సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ పండితులు బండి సంజయ్ కు ఆశీస్సులు అందించారు.

అనంతరం బండి సంజయ్ చీపురు, పార బట్టి సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. బండి సంజయ్ తోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు క్రిష్ణారెడ్డి సహా పార్టీ కార్యకర్తలంతా చీపురుపట్టి ఆలయ పరిసరాల్లో మొలిచిన పిచ్చి మొక్కలను ఏరిపారేశారు. చెత్త చెదారాన్ని ఊడ్చేశారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ?. ప్రధాని మోదీ, జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పిలుపు మేరకు దేవాలయాలు శుద్ధి చేస్తున్నామని చెప్పారు.

అందులో భాగంగా ఈరోజు ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయ పరిసరాలను శుద్ధి చేయడం సంతోషంగా వుందన్నారు. అయోధ్యలో ఈనెల 22న జరగబోయే అందాల రాముడు, అయోధ్య రాముడు, ఆదర్శ రాముడి విగ్రహా ప్రాణ ప్రతిష్ట కోసం యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తోందన్నారు.

తెలంగాణ ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు సిద్ధమైన నేపథ్యంలో 22వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు దేవుడి అక్షింతల కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని చెప్పారు. రామ మందిర నిర్మాణ నిధి సేకరణలో తెలంగాణ అగ్రభాగాన వుందన్నారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను మీడియా ప్రస్తావించగా? "అక్షింతల్లో రేషన్ బియ్యం, బాసుమతి బియ్యం, జై శ్రీరాం బియ్యం అనే రకాలు వుండవు. పవిత్రమైన దేవుడి అక్షింతలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు వక్రీకరించడం తగదు. కాంగ్రెస్ నేతలు కోరితే బాసుమతి బియ్యాన్ని పంపించేందుకు సిద్ధంగా ఉన్నాం"అని పేర్కొన్నారు.

## సైకిల్ యాత్రను ప్రారంభించిన బండి సంజయ్..

ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ:ప్రతిష్ట నేపథ్యంలో కరీంనగర్ యువకులు కరీంనగర్ నుండి అయోధ్యకు సైకిల్ పై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నగరానికి చెందిన మంగ వంశీ కృష్ణ, ఆదిత్య అనే ఇద్దరు యువకులు ఈరోజు బండి సంజయ్ వద్దకు వచ్చారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ సైకిల్ యాత్రను ప్రారంభించారు. రాత్రి వేళల్లో మంచు కురిసే అవకాశమున్నందున జాగ్రత్తగా వెళ్లాలని, వీలైనంత మేరకు పగటిపూటే సైకిల్ యాత్ర కొనసాగించాలని ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ.. భక్తులతో నిండిపోయిన కంపార్టుమెంట్లు

తిరుపతి, జనవరి 19: వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమల లో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో బాలాజీ సన్నిధి కిటికిటలాడుతుంది. సర్వదర్శనానికి వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి.

భక్తులు కృష్ణతేజ అతిథిగృహం వరకు క్యూలో నిలబడియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం లభిస్తుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న 62,649 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.74 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# దళిత బంధు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి

నల్లగొండ, జనవరి 19: దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలనే డిమాండ్తో శుక్రవారం శాలిగౌరారం మండలానికి చెందిన దళిత బంధుకు లబ్ధిదారులు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడగు నాగార్జున మాట్లాడుతూ.. బేష జాలాలకు పోకుండా పార్టీల మధ్యన ఉన్న వైశమ్యాలను పక్కకు పెట్టి దళిత బంధుకు ఎంపికైన లబ్ధిదారులకు గ్రౌండ్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు.

ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సిన ప్రక్రియ మొత్తం జరిగిందని, విడుదల చేసే నిధులను ఫ్రీజింగ్ చేయడం సరికాదని వారన్నారు. నల్లగొండ నియోజకవర్గం లోని 1050 మందినకి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినందున యధావిధిగా సాగాల్సిన గ్రౌండింగ్ ప్రక్రియ ఆగిపోయిందని చెప్పారు. నూతన ప్రభుత్వం దళిత బంధు నిధులను రీలిజ్ చేయలేదన్నారు.

ఈ కార్యక్రమంలో మామిడి రమేష్, ఏర్పుల నరెందర్, పోతెపాక నవీన్, బదుపుల శంకర్ మామిడి యాకూబ్ అద్దంకి రవీందర్, రాచకొండ గణేష్, మాచర్ల వెంకట్, ఈర్ల కిరణ్, దేగల ఏలీషా, మాగి రవి, పులిగిల్ల శంకర్, పనికర కమలాకర్, గుండ్లపల్లి రవి, బందేల ఉదయ, తోటకూరి వంశీ, నక్క నరేష్, రావీ దావీదు, ఆంజనేయులు, దేవరకొండ శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, సైదులు, సురేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# పదహారో ఫైనాన్స్ కమిశన్ కోసం పదవులను ఏర్పాటు చేయడానికి ఆమోదాన్ని తెలియ జేసిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, జనవరి 19:పదహారో ఫైనాన్స్ కమిశన్ కార్య భారాన్ని సంబాళించడం కోసం మూడు పదవుల ను ఏర్పాటు చేయడాని కి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న సమావేశమైన కేంద్ర మంత్రివర్గ ఆమోదాన్ని తెలియజేసింది. వీటిలో రెండు పోస్టు లు సంయుక్త కార్యదర్శి స్థాయి కి చెందినవి; మరొక పోస్టు ఆర్థిక సలహాదారు కు సంబంధించింది. పదహారో ఫైనాన్స్ కమిశను ను 2023 డిసెంబరు 31 వ తేదీ నాడు జారీ చేసిన నోటిఫికేశన్ ద్వారా రాజ్యాంగం లోని 280 వ అధికరణాన్ని అనుసరించి ఏర్పాటు చేయడమైంది.

కమిశన్ తన విధుల ను పూర్తి చేయడం లో సహాయాన్ని అందించడం కోసం క్రొత్త గా ఏర్పాటు చేసిన ఈ పోస్టుల అవసరం ఎంతైనా ఉంది. కమిశన్ లో ఇతర పోస్టుల ను అన్నింటిని వికేంద్రీకరించిన అధికారాల కు అనుగుణం గా ఏర్పాటు చేయడం ఈసరికే ముగిసింది.

# పేదలంటే చంద్రబాబుకు నచ్చదు : ఏపీ సీఎం జగన్

అమరావతి, జనవరి 19: దళితులు, పేదలంటే చంద్రబాబుకు ప్రేమ లేదని ఏపీ సీఎం జగన్ ఆరోపించారు. విజయవాడలో 125 అడుగులతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమానికి అంబేద్కర్ అహర్నిశలు పాటుపడ్డారని తెలిపారు. ఏపీలో అంటరాని తనం రూపం మార్చుకుందని అన్నారు.

పేదలను దూరంగా ఉంచడమే అంటరాని తనం కాదని, వారి సంక్షేమ, అభివృద్ధిని అడ్డుకోవడం, పథకాల అమలులో వివక్ష చూపడం అంటరాని తనమేనని పేర్కొన్నారు. ఏపీలో పేదలకు ఇళ్లు ఇస్తుంటే చంద్రబాబు అడ్డుకోవడం కూడా అంటరానితనమే విమర్శించారు. పేద కులాలు ఎప్పటికీ సేవకులుగానే ఉండాలట. పేదలు ఆత్మగౌరవంతో బతకవద్దని, పేదవారు ఇంగ్లిష్ మీడియం చదువవద్దని చంద్రబాబు కోరుకుం టున్నారని దుయ్యబట్టారు.అంబేద్కర్ భావజాలం అంటే పెత్తందార్లకు నచ్చదని పరోక్షంగా చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యనిం చారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. రాజ్యసభకు 8 మందిని పంపితే వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికమని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఎక్కడా లంచాలు లేవు, ఎక్కడా వివక్ష లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో దళితులకు ఒక్క సెంట్ భూమి ఇవ్వలేదని ఆరోపించారు.

# ఆర్టీసీ బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీ- 12 మందికి గాయాలు



హన్మకొండ, జనవరి 19: (నేటినిజం ప్రతినిధి): ఆర్టీసీ బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో 12మందికి గాయాలైన ఘటన ములుగు జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని పస్రా నుంచి హనుమకొండ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వరంగల్ నుంచి మణుగూరు వెళ్తోన్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. నీరుకుళ్ల శివారులోని జరిపోతుల వాగు మూలమలుపు వద్ద ఇవి ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి.

ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. మరో 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు ఆరోపించారు. ఆత్మకూరు సీఐ రవిరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# సర్పంచులపై కేటీఆర్‌ది కపట ప్రేమ



ఖమ్మం, జనవరి 19:(నేటనిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ నేత పెద్దమునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ...సర్పంచులు తాము చేసిన పనులకు బిల్లులు రాక బాధపడుతున్నారని వారికి తాను గొంతుకై పోరాడుతానని చెప్పడం హాస్యస్పదమని పెద్దమునగాల గ్రామ సర్పంచ్ విమర్శించారు. సర్పంచ్ పెండింగ్ బిల్లులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ పాలకులు సర్పంచులకు చెసింది ఎమిటని ప్రశ్నించారు. కేటిఆర్ కు నిజంగా సర్పంచుల సమస్యలపై ప్రేమ ఉంటే పది సంవత్సరాలలో అనేక మంది సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఎందుకు ఆత్మ హత్య చేసుకుంటారని ప్రశ్నించారు. పంచాయితీరాజ్ వ్యవస్థను నాశనం చేసిన కేటిఆర్ సర్పంచుల బాధల గూర్చి మాట్లాడడం విడ్డూరమని విమర్శించారు. సర్పంచుల సమస్యలపై పోరాటం చేస్తామని కేటిఆర్ చెప్పడం సిగ్గు చేటని అన్నారు.

# యువరక్తం ప్రపంచానికి ఎంతైనా అవసరం: లిల్లీ మేరి



హైదరాబాదు జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మనదేశంలో రక్తదాన ఉద్యమం ఆశించిన ఫలితాలు సాధించాలంటే యువత ముందుకు రావాలి అని అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే రక్తదానం చేయడానికి ముందుకు వస్తున్న వారి సంఖ్య మనదేశంలో చాలా తక్కువగా ఉంది అని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి అన్నారు. హైదరాబాదులోని వివేక్ నగర్ యందు నిర్వహించినటువంటి స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో లిల్లీ మేరి మాట్లాడుతూ మన శరీరములో దాదాపు ఐదారు లీటర్ల వరకు రక్తం ఉంటుంది అని, ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, ఇప్పటి వరకు రక్తానికి మాత్రం ప్రత్యామ్నాయం లేదు అని లిల్లీ మేరి పేర్కొన్నారు. ప్రమాదాల వల్లనైనా, మరే ఇతర కారణాల వల్లనైనా శరీరము ఎక్కువ పరిమాణములో రక్తాన్ని కోల్పోతే, ఆ లోటును రక్తంతో మాత్రమే భర్తీ చేయటం సాధ్యమవుతుంది అని, సరైన సమయంలో కనుక వారికి రక్తం ఇవ్వగలిగితే వారి విలువైన ప్రాణాలను కాపాడ గలుగుతాం అని, ఒక్క ప్రమాదాల లోనే కాదు, అత్యవసర శస్త్ర చికిత్సలు, క్లిష్టమైన ప్రసవాలలో, అనేమియా, తలసీమియా వంటి తీవ్ర అనారోగ్య పరిస్థితులలో కూడా రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది అని, రక్తానికి ప్రత్యామ్నాయం లేదు అని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము అని, అందువల్ల మనము చేసే రక్త దానవే వాళ్లకు ప్రాణదానంగా మారుతుంది అని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరి తెలిపారు.



# 12 రోజుల్లో సీఎంఆర్ లక్ష్యం చేరకపోతే జరిమానా వేస్తాం

## -రైస్ మిల్లర్ లకు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



రాజన్న సిరిసిల్ల, జనవరి 19:(నేటినిజం ప్రతినిధి): రానున్న 12 రోజుల్లో సీఎంఆర్ లక్ష్యం చేరకపోతే సంబంధిత రైస్ మిల్లర్ లకు జరిమానా విధిస్తామని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హెచ్చరినీచారు. సీఎంఆర్ సరఫరాపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని రా, బాయిల్ రైస్ మిల్లర్ లతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 2022-23 సీజన్ సీఎంఆర్ 12 రోజుల్లో ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గడువులోగా సీఎంఆర్ ఇవ్వకపోతే జరిమానా వేస్తామని, నిబంధనలు ఉల్లఘింఫించే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎంఆర్ రవాణాలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ భరోసా ఇచ్చారు. రైస్ మిల్లులో బియ్యం మర పట్టించడం, తరలింపును పర్యవేక్షినీచేనీదుకు ఒక టీంను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమీక్షలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, రైస్ మిల్లుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈయూ - ఇండియా ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఫ్రేమ్‌వర్క్ కింద సెమీకండక్టర్స్ సానుకూల వ్యవస్థ కోసం అవగాహన ఒప్పందాన్ని క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 19:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గానికి సెమీకండక్టర్స్ సానుకూల వ్యవస్థ కోసం దాని సరఫరా వ్యవస్థ పై కార్యనిర్వహణ ఏర్పాట్లుపై ఈ యూ - ఇండియా ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఫ్రేమ్‌వర్క్ కింద 2023 నవంబర్ 21న రిపబ్లిక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వం యూరోపియన్ కమిషన్ మధ్య సంతకం చేసిన అవగాహన ఒప్పందం గురించి వివరిం చబడింది.

పరిశ్రమలు మరియు డిజిటల్ టెక్నాలజీల అభివృద్ధి కోసం సెమీకండక్టర్‌ను మెరుగుపరచడం కోసం భారతదేశం మరియు ఈ యూ - మధ్య సహకారాన్ని బలోపేతం చేయ డానికి ఎమ్ఓయు ఉద్దేశించబడింది.

ఈ ఎమ్ఓయు సంతకం చేసిన తేదీ నుండి అమలులోకి వస్తుంది మరియు ఈ ఎమ్ఓయు యొక్క లక్ష్యాలను సాధించినట్లు ఇరుపక్షాలు నిర్ధారించే వరకు లేదా ఒక వైపు ఈ ఎమ్ఓయు భాగస్వామ్యాన్ని నిలిపివేసే వరకు కొనసాగవచ్చు.

జీ 2జీ మరియు బి 2 బి ద్వైపాక్షిక సహకారం రెండూ సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థ యొక్క సుద్రుడతను పెంచడానికి మరియు సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని ప్రోత్సహించడానికి పరిపూరకరమైన బలాన్ని పెంచుతాయి.

ఎలక్ట్రానిక్స్ తయారీకి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ఎం ఈ ఐ టీ వై చురుకుగా పని చేస్తోంది. భారతదేశంలో బలమైన మరియు స్థిరమైన సెమీకండక్టర్ డిస్ప్లే పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిని నిర్ధారించే ఉద్దేశ్యంతో భారతదేశంలో సెమీకండక్టర్ మరియు డిస్ప్లే తయారీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి కోసం ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. సెమీకండక్టర్ ఫ్యాబ్స్, డిస్ప్లే ఫ్యాబ్స్, కాంపౌండ్ సెమీకండక్టర్స్/సిలికాన్ ఫోటోనిక్స్/సెన్సార్స్/డిస్క్రీట్ సెమీకండక్టర్స్ మరియు సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్ మరియు ప్యాకేజింగ్/అవుట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ మరియు టెస్టికండక్టర్ అసెంబ్లీ మరియు టెస్టింగ్ సౌకర్యాలు కోసం ఆర్థిక సహాయాన్ని అందించడం ఈ ప్రోగ్రామ్ లక్ష్యం.

ఇంకా, దేశంలో సెమీకండక్టర్ మరియు డిస్ప్లే తయారీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి భారతదేశం యొక్క వ్యూహాలను అమలు చేయడానికి డిజిటల్ ఇండియా కార్పొరేషన్ కింద ఇండియా సెమీక ండక్టర్ మిషన్ స్థాపించబడింది.

ద్వైపాక్షిక మరియు ప్రాంతీయ ఫ్రేమ్‌వర్క్‌ల క్రింద ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క అభివృద్ధి చెందుతున్న మరియు అధునాతన రంగాలలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి ఎం ఈ ఐ టీ వై చురుకుగా కృషి చేస్తోంది. ఈ లక్ష్యంతో, ద్వైపాక్షిక సహకారాన్ని మరియు సమాచార మార్పిడిని ప్రోత్సహించడానికి మరియు భారత దేశం విశ్వసనీయ భాగస్వామిగా ఆవిర్భవించేలా సరఫరా వ్యవస్థ సుద్రుడతను నిర్ధారించడానికి ఎం ఈ ఐ టీ వై వివిధ దేశాల సంస్థలు/ ఏజెన్సీలతో అవగాహన ఒప్పందాలు/ ఎం ఓ సీలు/ ఒప్పందాలను కుదుర్చుకుంది.

సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థను పెంచడానికి మరియు సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని ప్రోత్సహించడానికి పరిపూరకరమైన బలాన్ని పెంచుకోవడానికి ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడం, భారతదేశం మరియు ఈ యూ పరస్పర ప్రయోజనకరమైన సెమీకండక్టర్ సంబంధిత వ్యాపార అవకాశాలు అభివృద్ధి కి భారతదేశం మరియు ఈ యూ మధ్య జరిగిన ఈ ఎమ్ఓయుపై సంతకం ద్వారా ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరో అడుగు వేశాయి.

# మాధకద్రవ్యాలను నిర్మూలించేది నేటి తరం విద్యార్థులే

## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## -యాంటీ డ్రగ్ క్లబ్స్' ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

రాజన్న సిరిసిల్ల, జనవరి 19:(నేటినిజం ప్రతినిధి): "యాంటీ డ్రగ్ క్లబ్స్" ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో కళాశాలల్లో, పాఠశాల్లో విద్యార్థిని విద్యార్థులకు మాధకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం ద్వారా కలిగే అనర్థాల పట్ల యువతలో అవగాహన పెంపొందించడం కోసం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్., ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి తో కలసి పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల, వికాస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీలకు ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై, మాధకద్రవ్యాల వలన కలుగు అనర్థాల మీద దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,రాబోవు రోజుల్లో మాధకద్రవ్యాలను నిర్మూలించేది నేటి తరం విద్యార్థులే అని అన్నారు. విద్యార్థుల దృష్టి తమ కెరీర్ మీద మాత్రమే ఉండాలని,నిషేధిత డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని ఎస్పీ గారు సూచించారు.డ్రగ్స్ వాడడం అనేది వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అనేక విధాలుగా పాడుచేస్తుందని గుర్తు చేశారు.

జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వవినూత్న కార్యక్రమాలు చేపడుతూ మత్తు పదార్థాల మీద అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే జిల్లాలోని అన్ని పాఠశాల, కళాశాల విద్యార్థులతో ఉ



పాధ్యాయులతో కలిసి యాంటీ డ్రగ్స్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విద్యార్థిని, విద్యార్థులు మత్తు పదార్థాలకు మరియు చెడు అలవాట్లను ప్రోత్సాహించే వారికి దూరంగా ఉండాలని అన్నారు.యాంటీ డ్రగ్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణ మీద స్లోగన్ కాంపిటీషన్ ,వ్యాసరచన,డిబేట్ పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుంది అన్నారు.

'' మేము డ్రగ్స్ తీసుకోము,బంధుమిత్రులు, చుట్టుపక్కల వారు, స్నేహితులు మాధకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిని చూసుకునే బాధ్యత మాదే అని డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాల గురించి వారికి వివరిస్తాం " అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. జిల్లాలో గంజాయి కి సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా సరే వెంటనే డైల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోపంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మండలాల వారీగా ఎంపిక చేసి వారికి జిల్లా స్థాయిలో ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, టౌన్ సిఐ రఘుపతి, ఎస్ఐ రాజు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఆకునూరి వెంకటేష్, పాటశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఘనంగా చేపట్టాలి: అదనపు కలెక్టర్





ఖమ్మం, జనవరి 19:(నేటి నిజం ప్రతినిధి): గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఘనంగా చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అదనపు కలెక్టరు డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల తో ఈ నెల 26న పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అమలవుచున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై జిల్లా కలెక్టరే గారి సందేశం తయారుకు నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, స్టేజి ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు చర్యలు చేపట్టా లన్నారు. వివిధ శాఖలు నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మీద స్టాల్స్ ఏర్పాటు, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీకి కార్యాచరణ చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను ప్రతిపాదనలు సమర్పించాల న్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.అ ప్పారావు, జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి శ్రీనివాసు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుమ, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, జిల్లా సాంఘీ?క సంక్షేమ శాఖ అధికారి కె.సత్యనారాయణ, ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ నవీన్, జిల్లా ఉపాధికల్పనాధికారి కె.శ్రీరామ్ మత్స్యశాఖ ఏడి అంజనేయ స్వామి, పశుసంవర్ధక శాఖ జె.డి వేణు మనోహర్ రావు, జిల్లా రవాణా శాఖ అధికారి గౌస్‌పాషా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.అనసూయ, కార్మిక శాఖ అధికారి వెంగమాంబ, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖరశర్మ, జిల్లా సహకార శాఖ అధికారి విజయ కుమారి, ఏసిపి గణేష్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

నాగర్‌కర్నూల్, జనవరి 19: కల్వకుర్తిలో ఇటీవల చోటు చేసుకున్న వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కల్వకుర్తి పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో రెండు హత్యలు వెలుగులోకి వచ్చాయి.

వృద్ధురాలితో పాటు మరొకరిని హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. నిందితులను కల్వకుర్తికి చెందిన వాసి వెంకటేశ్, తెలకపల్లి మండలం వట్టిపల్లికి చెందిన అలివేలుగా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ. 4 లక్షల విలువైన బంగారు, వెండి నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో అక్రమ కలప పట్టివేత

ఆసిఫాబాద్, జనవరి 19: ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని చిర్రకుంట సెక్షన్‌లో శుక్రవారం ఉదయం అటవీ అధికారులు అక్రమ కలప పట్టుకున్నారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని భవానినగర్ నుండి వస్తున్న టాటా ఇండికా విస్టా కారు నెంబర్ (టీఎస్08 యుబి3974) వాహనంలో అక్రమంగా కలప తరలిస్తుండగా సెక్షన్ అధికారి సాయి చరణ్ తన బృందంతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో 12 కలప దుంగలు పట్టుకున్నారని, వాటి విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో బీటు అధికారులు ఎం.శ్రీనివాస్, రాజేష్, డి .శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 19:'గత 5 ఏళ్లలో బడ్జెట్ కేటాయింపుల్లో రూ.లక్ష కోట్లు కోత పెట్టిన వ్యవసాయ మంత్రిత్వ శాఖ' అనే శీర్షికతో ఒక వార్తా కథనం ప్రచురితమైంది. మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి వివరణ అడగకుండానే నిధుల కోత కథనాన్ని ప్రచురించారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను మాత్రం అందులో పేర్కొనలేదు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. దేర్‌తో సహా వ్యవసాయం ఉ సహకార విభాగానికి బడ్జెట్ కేటాయింపులను అనేక రెట్లు పెంచింది. 2013-14లో ఈ కేటాయింపులు రూ.27,662.67 కోట్లు కాగా, 2023-24లో అవి రూ.1,25,035.79 కోట్లకు చేరాయి.

కేంద్ర వ్యవసాయం ఉ రైతుల సంక్షేమ శాఖ బడ్జెట్‌లో మూడు ప్రధాన పథకాలు ఉన్నాయి, మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో వాటి వాటా 80-85% వరకు ఉంటుంది. వాటిలో, పీఎం-కిసాన్ పథకం 2019లో ప్రారంభమైంది. 30.11.2023 నాటికి, 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' (డీబీటీ) ద్వారా 11 కోట్ల మందికి పైగా రైతులకు రూ.2.81 లక్షల కోట్లకు పైగా నగదు విడుదలైంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) 2016లో ప్రారంభమైంది. గత 7 సంవత్సరాల్లో 49.44 కోట్ల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు, వారిలో 14.06 కోట్ల (తాత్కాలిక లెక్క) రైతులకు రూ.1,46,664 కోట్లకు పైగా క్లెయిమ్‌లు స్వీకరించారు. వ్యవసాయ రంగానికి సంస్థాగత రుణం 2013-14లోని రూ. 7.3 లక్షల కోట్ల నుంచి 2022-23 నాటికి రూ.21.55 లక్షల కోట్లకు పెరిగింది. కేసీసీ ద్వారా సంస్థాగత రాయితీ రుణం ప్రయోజనాన్ని ఇప్పుడు పశు సంవర్ధక, మత్స్య రైతులు కూడా పొందుతున్నారు.

పైన చెప్పిన మూడు ప్రధాన కేంద్ర రంగ పథకాలు భూమి ఉన్న అర్హులైన రైతులందరికీ అందుతున్నాయి. ఈశాన్య ప్రాంతంలో భూమి యాజమాన్యం సంఘ ఆధారితం. ఆ ప్రాంతంలో సాగు చేయదగిన భూమి తక్కువగా ఉంది కాబట్టి, ఈ పథకాలపై చేసే వ్యయం ఈశాన్య రాష్ట్రాల్లో 10% తక్కువగా ఉంటుంది. బడ్జెట్ కేటాయింపుల్లో మిగిలిన మొత్తం ఇతర పథకాలు, విభాగాల కోసం అందుబాటులో ఉంటుంది.

నిధుల అవసరాలపై రాష్ట్ర ప్రభుత్వాలు, రైతు సంఘాలు, పథకాలను అమలు చేసే ఏజెన్సీలతో సంప్రదించిన తర్వాత, కేంద్ర ప్రభుత్వ, కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం బడ్జెట్ అంచనాలను (బీఈ) వ్యవసాయం ఉ సహకార విభాగం సిద్ధం చేస్తుంది. ఆ సంవత్సరంలో వాస్తవ వ్యయం, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద మిగిలిన నిల్వలు, నిధుల అవసరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, సవరించిన అంచనా (ఆర్ఈ) దశలో కేటాయింపులు పెరుగుతాయి/తగ్గుతాయి. గత 4 సంవత్సరాల్లో, ఆర్ఈ దశలో ఈ ఖాతా తప్పనిసరి సవరింపు ద్వారా మిగిలిన మొత్తం రూ.64900.12 కోట్లుగా ఉంది. ఈశాన్య ప్రాంతానికి మొత్తం కేటాయింపులో 10% తగ్గింపు నిబంధన కారణంగా సుమారు రూ.40,000 కోట్ల మొత్తం తగ్గించడం జరిగింది.

కేంద్ర ప్రాయోజిత పథకాలైన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషివున్నతి యోజనను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నిదానంగా ఉండటం, నిధుల విడుదల విషయంలో కొత్త విధానం కారణంగా క్షేత్ర స్థాయిలో నిధుల వ్యయం తక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర వాటాను చేర్చి సకాలంలో నిధులను ఖర్చు చేయాలి. ఆ తర్వాత కేంద్రం నుంచి తదుపరి దఫా నిధులు విడుదలవుతాయి. వ్యవసాయం ఉ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, లను సరైన సమయంలో ఖర్చు చేసిన రాష్ట్రాలకు తదుపరి దఫాల్లో తగినన్ని నిధులను అందుబాటులో ఉంచింది, రైతు సంక్షేమ పథకాల అమలుకు నిధుల కొరత లేకుండా చూస్తోంది.

# లోక్‌సభ ఎన్నికలు 2024కు ముందు దేశవ్యాప్తంగా ఇవిఎంలు, వివిపిఎటిలపై అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇసిఐ

న్యూఢిల్లీ, జనవరి 19: త్వరలో జరుగనున్న లోక్‌సభకు 2024 ఎన్నికల దృష్ట్యా ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్ (ఇవిఎం), వోటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిపిఎటి) గురించి దేశవ్యాప్తంగా పౌరులకు ఓటింగ్ ప్రక్రియ గురించి ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించేందుకు, యంత్రాలతో పరిచయం చేసేందుకు అవగాహన కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. లోక్‌సభకు, రాష్ట్ర శాసన సభ ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న ఈ అవగాహనా కార్యక్రమం ఇవిఎంలు, వివిపిఎటిల ప్రాథమిక లక్షణాల గురించి జ్ఞానాన్ని అందించడం, తమ ఎంపికలను వివిపిఎటి స్లిప్ ద్వారా ధ్రువీకరించుకోవడం గురించి వారికి తెలియచెప్పడంపై దృష్టి పెట్టింది. భౌతిక ప్రదర్శన ద్వారా ఇవిఎం ఉ వివిపిఎటి కార్యాచరణపై లోతైన అవగాహనను పెంపొందించడమే కాక అపోహలను తొలగించి, ఓటరు విశ్వాసాన్ని పెంపొందించడంలో, మరింత సమాచారంతో ఓటర్లను భాగస్వాములను చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.



ఈ కార్యక్రమంలో 31 రాష్ట్రాలు/ యూటీలలోని 613 జిల్లాల్లో విస్తరించి ఉన్న 3464 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం (ఇందులో 5 రాష్ట్రాలలో ఇటీవలే ఎన్నికలు జరిగాయి), అవగాహన కార్యకలాపాలు ఉన్నాయి. దాదాపు 3500 ప్రదర్శనా కేంద్రంలో, సుమారు 4250 మొబైల్ వ్యాన్లను ఇవిఎం/ వివిపిఎటి పనితీరును ప్రజలకు భౌతికంగా ప్రదర్శించేందుకు ఏర్పాటు చేశారు. ఈ అవగాహనా కార్యక్రమం విస్తారతను పెంచేందుకు అన్ని సోషల్ మీడియా వేదికలపై సిఇఒలు, డిఇఒలు తాజా సమాచారాన్ని పంచుతున్నారు.

ఇసిఐ స్థాయి సూచల ప్రకారం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు ఎన్నికల ప్రకటనకు సుమారు 3 నెలల ముందు నుంచి దృష్టి కేంద్రీకరించిన అవగాహనా ప్రచారాన్ని నిర్వహించాలి ( ఇందుకోసం గత ఎన్నికల తేదీని పరిగణనలోకి తీసుకోవచ్చు). అసెంబ్లీ నియోజకవర్గం/ సెగ్మెంట్ల వారీగా డిఇఒ అవగాహనా ప్రచారానికి షెడ్యూల్ తయారు చేశారు. దీనిని జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, స్థానిక మీడియాతో కూడా పంచుకోవడం జరుగుతుంది.

బహిరంగ ప్రదర్శన కార్యక్రమాలతో సహా శిక్షణ, అవగాహన (టిఅఎ) ప్రయోజనాల కోసం ఇవిఎంల ఉపయోగం కోసం కమిషన్ వివరణాత్మక, ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని కలిగి ఉంది. ఎస్ఒపిలో టిఅఎ ఇవిఎంల నిర్వహణ,నిల్వ కోసం, డమ్మీ గుర్తులతో ఎఫ్ఎల్‌సిఒకె ఇవిఎంల వినియోగం, శిక్షణ, అవగాహన తదితర శిక్షణా కార్యక్రమం సందర్భంగా ఉత్పత్తి అయిన వివిపిఎటి స్లిప్పులను ధ్వంసం చేయడం సహా ప్రోటోకళ్లు ఉన్నాయి. టిఅఎ కోసం ఉపయోగించిన ఇవిఎంల జాబితాను కూడా రాజకీయ పార్టీలకు రసీదుతో అందించడం జరుగుతుంది.

మరిన్ని వివరాల కోసం, వ్యక్తులు ఇవిఎంల మాన్యువల్‌లోని శిక్షణ అవగాహన శీర్షిక కలిగిన 5వ అధ్యాయాన్ని చూడవచ్చు. ఇది ఇసిఐ వెబ్‌సైట్‌పై అందుబాటులో ఉంటుంది.

# అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

అమరావతి, జనవరి 19:ఏపీలోని అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో ముగ్గురు మృతి చెందారు. వివరాలు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓ కుటుంబం కారు లో అనకాపల్లికి బయలు దేరింది. జిల్లాలోని సంకరం వద్ద జాతీయ రహదారి(ఔజీబితినీనిజీశ్రీ ఉతిణష్టలిజీఏఉః పై వీరు ప్రయాణిస్తున్న కారు పంక్చర్ కావడంతో ఒక్కసారిగా కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, బాలుడు మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

కళానిలయం సాంస్కృతిక సంస్థ సేవా సంస్థ Regd. 6284 శ్రీ త్యాగరాయ గానసభ (ప్రపంచ రికార్డులు పొందిన ఆడిటోరియం)
యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని
ఫణి భార్గవ్ యాదిలో...
నగదు పురస్కారం
శ్రీ పగిడిపాల ఆంజనేయులు గారు సీనియర్ జర్నలిస్ట్, సాక్షి
శ్రీ యం. రాఘవేందర్ రెడ్డి గారు సీనియర్ ఎన్.టి.వి. జర్నలిస్ట్
కుమారి ఎన్. హెమలత గారు సీనియర్ కరస్పాండెంట్, ఎ.బి.ఎన్.
ఆర్థిక సహకారం
సడియా బేగం గారు ఇంటర్ విద్యార్థికి

ఆత్మీయ సత్కారం : డా॥ వి. లత గారు నేత్ర వైద్యులు
ముఖ్యఅతిథి : శ్రీ కె. రామచంద్రమూర్తి గారు ప్రముఖ సంపాదకులు
సభాప్రారంభకులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు ప్రముఖ సాహితీవేత్త
సభాధ్యక్షులు : డా॥ యం.కె. రాము గారు పూర్వ సంచాలకులు, జవహర్ బాలభవన్, రచయిత
అతిథులు
లయన్. కళా వి.యస్. జనార్ధన్ మూర్తి గారు అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
శ్రీ బైస దేవదాసు గారు సంపాదకులు, నేటినిజం దినపత్రిక
డా॥ రెంటాల జయదేవ గారు సీనియర్ జర్నలిస్ట్, రచయిత, సినీ విశ్లేషకులు
శ్రీమతి తులసి నృత్య గురువు (శ్రీ సాయి నటరాజ అకాడమి) మరియు
శ్రీమతి సుష్మా ఉదయమహంతి నృత్య గురువు, శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు
శ్రీమతి వేమూరి మంజుల లలితగీతాల గానం
24-01-2024 సా॥ 5.00 గం॥లకు, వేదిక : కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి.
శ్రీమతి కళాశారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి త్యాగరాయ గానసభ
డి. దయాకర్ రాజు, కన్వీనర్ 8978500443
ఎ.సురేందర్, స్థాపక కార్యదర్శి 9550512032
శ్రీమతి ఎ. పుష్పలత అధ్యక్షులు

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.